
ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక



Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 17.05.2026 | సంపుటి : 12 సంచిక : 297 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



వెండి దిగుమతులపై కేంద్రం

## ఆంక్షలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియాలో సంక్షోభం వేళ ఇటీవల బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించింది. స్వేచ్ఛా విధానం నుంచి పరిమిత విధానానికి సవరించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని విదేశీ వాణిజ్య విభాగ డైరెక్టరేట్ జనరల్ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఆంక్షల విభాగంలో ఉండే వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.విదేశీ మారకపు ద్రవ్యాన్ని జాగ్రత్తగా వాడుకునేందుకు

మిగతా 2లో..

2027 చివరికల్లా

# దేవాదుల పూర్తి చేస్తాం

మరో రూ. 3978 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళిక

- 38.16 టీఎంసీలతో తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీరు
- కరీంనగర్ జిల్లాలో 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు
- ప్రాజెక్టు పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష
- పాల్గొన్న మంత్రులు పొన్నం, సీతక్క



హైదరాబాద్(జనంసాక్షి):2027 చివరికల్లా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 38.16 టీఎంసీలతో తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీరు అందిస్తామని 8 జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లాలో 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. పనుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్, పొన్నం,సీతక్క సమీక్షించారు. ప్రజాప్రతినిధులు, ఇంజినీర్లతో ఈ సమీక్ష జరిగింది. సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టుపై ఇప్పటి వరకు పెట్టిన ఖర్చు రూ. 14,422 కోట్లు అని ఇప్పటి వరకు 87.70 శాతం పనులు పూర్తయ్యా యన్నారు. మరో రూ. 3,978 కోట్లతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు.

## ప్రజల నెత్తిన పెట్రో పిడుగు

- ఈ నిర్ణయంతో అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం
- నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల తీవ్ర ఇబ్బందులు పడతారు
- మోదీ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది
- ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయింది
- ధరల పెంపు దారుణం : సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి):పెట్రో ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం

మిగతా 2లో..

తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు

## త్రిభాషా విధానం తప్పనిసరి

CBSE

సీబీఎస్ఈ కీలక నిర్ణయం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేసింది. జులై ఒకటి నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. సీబీఎస్ఈ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. ఆ మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు ఉండాలి. మూడు భాషలను అధ్యయనం చేయాలి. ఇక పదో తరగతి విద్యార్థులకు ఒక ఊరట కల్పించింది. మూడో భాషకు బోర్డ్ ఎగ్జామ్ ఉండదని వెల్లడించింది. వారు భాషాధ్యయనంపైనే దృష్టి సారించేలా.. అనవసర ఒత్తిడి తగ్గించేందుకే ఈ ఏర్పాటు అని బోర్డ్ పేర్కొంది. ఆ పాఠ్యాంశానికి

మిగతా 2లో..



## పోక్సో కేసులో భగీరథ్ అరెస్టు

నార్సింగి పోలీస్ అకాడమీ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ రమేశ్‌రెడ్డి
- అంతకుముందు భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు
- కేసులో మేడ్చల్ మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలు నమోదు

హైదరాబాద్(జనంసాక్షి): పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సీపీ రమేశ్‌రెడ్డి తెలిపారు. నార్సింగిలో పోలీసు అకాడమీ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్టు సీపీ తెలిపారు. కాగా మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను 40 నిమిషాల పాటు రికార్డు

మిగతా 2లో..

### బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి

ఆయన కుమారుడి విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన పదవిలో ఉండొద్దు

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత లేఖ

2లో..



ఉగ్రవాదులను ఉసిగొల్పితే

## ప్రపంచపటంపై పాక్ గల్లంతే..

- వారికి ఆశ్రయమిస్తే ఊరుకునేది లేదు
- పాక్‌ను నేరుగా హెచ్చరించిన ఆర్మీ చీఫ్ ద్వివేదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచ పటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని,

మిగతా 2లో..

నీట్ పేపర్ లీక్..


## మరొకరు బలి

- తాజాగా రాజస్థాన్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య
- కేసులో వ్యవహారంలో మరో అరెస్టు
- కీలక సూత్రధారి పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషాను అదుపులోకి తీసుకున్న సీబీఐ




జయపుర(జనంసాక్షి): నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ లీక్‌వల్ల పరీక్ష రద్దవడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రాజస్థాన్‌లోనూ ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ పరీక్షలో 650 మార్కులు వస్తాయని తన కుమారుడు చెప్పాడంటూ అతడి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఝున్‌ఝున్ జిల్లాకు చెందిన ప్రదీప్ మహిచ్.. తన ఇద్దరు సోదరులతో కలిసి సికార్‌లో నివసిస్తున్నాడు. అక్కడే నీట్ పరీక్ష కోసం ఒక ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకున్నాడు. మే 3న జరిగిన నీట్- యూజీ పరీక్ష రాశాడు. అయితే, శుక్రవారం మధ్యాహ్నం అతడు తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన అతడి సోదరి వెంటనే స్థానికుల సహాయంతో సమీప ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నీట్ పరీక్షను బాగా రాసినట్లు తన కుమారుడు చెప్పాడని, 650 మార్కులు వస్తాయన్నాడని ప్రదీప్ తండ్రి పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ సీటు ఖాయమని గట్టి నమ్మకంతో ఉన్నాడంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష రద్దవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య

మిగతా 2లో..



### 22 లక్షల మంది విద్యార్థుల కలలు చిన్నాభిన్నం

- వారి కష్టం నీటిపాలైంది
- కేంద్ర విద్యాశాఖ మంత్రి
- ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలి
- రాహుల్ గాంధీ డిమాండ్

2లో..

### విజయ్ వద్దే హోంశాఖ

పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కూడా..

సెంగొట్టియన్‌కు ఆర్థిక శాఖ

మంత్రులకు శాఖల కేటాయించిన ముఖ్యమంత్రి విజయ్



చెన్నై(జనంసాక్షి):ముఖ్యమంత్రి విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,

మిగతా 2లో..

### నేడు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె

2లో..

ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం ఇచ్చింది

# గుండుసున్నా



- వారు ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది
- 15-20 రోజుల తర్వాత ఇండ్లకు ఆపిన మొత్తాన్ని విడుదల చేస్తాం
- జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రారంభం
- ఈనెల చివరిలోగా భూముల విలువల సవరణ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రావలసిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని, కేంద్రం ఒక్కో ఇంటికి సుమారు 1 లక్షా 13 వేల రూపాయిల వాటా విడుదల కావాల్సి ఉందని, కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్దిదారులకు ఫైనల్ బిల్ ఆపడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు అన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతానికి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం మీడియా తో చిట్ చాట్ నిర్వహించిన సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం పలుమార్లు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరితో పాటు తాను కూడా ప్రాతినిధ్యం చేశామని చెప్పారు. ఆ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తూ మరో వైపు ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇంటికి 1.60 లక్షల రూపాయిలను తాత్కాలికంగా ఆపామని, ఒకవేళ కేంద్రం మరో 15-20 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్దిదారులకు నిధులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

## తైవాన్ విషయం .. మాకు కష్టమైన సమస్యే



- వారి స్వాతంత్ర్యం కోసం మేం పోరాడబోం
- చైనా పర్యటన అనంతరం మాటమార్చిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు.' 'తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలో మీటర్ల దూరంలో ఉండగా, అమెరికాకు మాత్రం 15 వేల కి.మీ.కు పైగా దూరాన ఉంది. ఎక్కువ దూరం కావడంతో మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి" అని ఓ వార్తాసంస్థ తో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో అమెరికా- చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్పా... ప్రత్యర్థులుగా కాదని

మిగతా 2లో..

### ఐసిస్ అగ్ర కమాండర్‌ను మట్టుబెట్టాం

అమెరికా, నైజీరియా సంయుక్త ఆపరేషన్‌లో అబు-బిలాల్ అల్-మినూకిని మృతి చెందాడు

ట్రూత్‌లో ప్రకటించిన ట్రంప్

2లో..

సెమీకండక్టర్ల విషయంలో భారత్

## కీలక ముందడుగు

- అప్పుడు నాలుగే యూనికార్న్‌లు.. ఇప్పుడు 100కు పైగా..
- నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోదీ
- భారత ప్రధాని మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం
- మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు



న్యూఢిల్లీ(జనంసాక్షి):సెమికండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగు తున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూని కార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమికండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా 2లో..

### 18న కేరళలో కొలువుదీరనున్న యూడీఎఫ్ ప్రభుత్వం

నేడు గవర్నర్‌కు మంత్రుల జాబితా

కాబోయే సీఎం అభ్యర్థి సతీషన్ వెల్లడి

### తెలంగాణలో ఇవాళ, రేపు వర్షాలు

30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు

నెల చివరలో వడగాలులు వీచే అవకాశం

### మొయినాబాద్ ఫాంహౌస్‌లో దారుణం

ఇద్దరు మహిళ హత్య

అప్పు ఎగ్గొట్టేందుకు ఘాతుకం

వివరాలు లోపలి పేజీల్లో..

## న్యాయవ్యవస్థ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి

- ఆస్పత్రుల్లా 24 గంటలూ సేవలందించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- నా అభిప్రాయాలను వక్రీకకరించిన ఓ వర్గం మీడియా
- బొద్దింక వ్యాఖ్యలపై సుప్రీం సిజెఐ వివరణ



న్యూఢిల్లీ(జనంసాక్షి): న్యాయవ్యవస్థ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సామాన్యుడి సమస్యలను పరిష్కరించేందుకు న్యాయస్థానాలు 24×7 ఆసుపత్రుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగించే యంత్రాంగం ఉండాలని అన్నారు. న్యాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయడానికి సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థను మరింతగా విస్తరించాలని సూచించారు. కొవిడ్ సమయంలోనూ విధులను నిర్వర్తించిన ఏకైక న్యాయవ్యవస్థ భారత్‌ది

మిగతా 9లో..

# పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం

### హైదరాబాద్‌లో సీపీఎం నిరసన ప్రదర్శన




**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం పడుతుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు. మోదీ చెబుతున్న పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థిలో ఉందని చెప్పారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌నకు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, సీనియర్ నేత డీజీ.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై అదే నిర్లక్ష్యం

- ధాన్యం సేకరణలో పూర్తి వైఫల్యం: వేముల



**నిజామాబాద్, మే16 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళు ,, తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల మయ్యిందని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. సిఎం రేవంత్ సమీక్షించినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. మక్కలు, వరి ధన్యం కొనుగోలు చేసి, సకాలంలో తరలించకపోవడంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రతి వర్గానికి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చా క రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను ఇలా అందరినీ మోసం చేసిందని మండిపడ్డారు. జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి, రైతులకు మద్దతు కల్పించాలని డిమాండ్ చేసారు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా మంత్రులకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ. 15 వేల సాయం, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, వరికి బోనస్, ప్రతి పంటకు మద్దతు ధర, రైతుబీమా కొనసాగింపు, వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళలకు భరోసా, నిరు ద్యోగులకు ఉపాధి అవకాశాలు అంటూ అనేక హామీలు ఇచ్చిందని గు ర్తుచేశారు. కానీ నేడు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. వృద్ధులకు భరోసా అందడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇక్కట్లు

- రైతులను ఇబ్బంది పెడుతున్న సర్కార్
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


**పెద్దపల్లి, మే 16 (జనంసాక్షి) :** పదేళ్ల కేసీఆర్ పాలన యావత్ తెలంగాణ రైతాంగం రాజులుగా దర్జాగా బతికారని, రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో రైతుల జీవితాలను అగమాగమయ్యాయని రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో 'దోచుకో.. దాచుకో..' అనే నినాదం తప్ప, రైతులను ఆదు కునే ధ్యాసే లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం చేసిన జాప్యం ఇప్పుడు, రైతుల పాలిటశాపంగా మారిందని మండి పడ్డారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల అంతా సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని, సకాలంలో ఎరువుల పంపిణీ, రైతుబంధు, ధాన్యం కొనుగోలు చేసి నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు గుర్తుచేశారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉండటంతో ఇటీవల అకాల వర్షాలు కురిసి ధాన్యం తడిసి రైతులకు ఇబ్బందులు అయ్యాయని అన్నారు. ధాన్యం బస్తాల్లో కోతలు విధించడంతో రైతుకు ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జామ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

- రాహుల్‌ను కోరిని పరిగి ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ, మే16 (జనంసాక్షి) :** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీకి వినతి సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనకు మంత్రి పదవి వచ్చేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# డీజీపీకి శేర్ నర్సారెడ్డి శుభాకాంక్షలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను శనివారంనాడు హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ కు పుష్పగుచ్చంను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ నూతన బాధ్యతల్లో డిజిపి విజయ వంతం కావాలని, అయన నేతృత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు మరింత పటిష్టం కావాలని శేర్ నర్సారెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణను జీరో క్రైం రేట్ స్టేట్ గా మార్చే లక్ష్యంతో నూతన డిజిపి సివి ఆనంద్ కృషి చేస్తారనే ఆశాభావాన్ని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి వ్యక్తం చేశారు.

# అంత్యపుష్కరాలకు కౌంట్‌డౌన్

- నిర్వహణ కోసం రూ.21.98 కోట్లు విడుదల
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం



**కాళేశ్వరం , మే 17 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం లో సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.సరస్వతి అంత్య పుష్కరాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 21.98 కోట్ల నిధులను విడుదల చేసింది.వీటిలో ఇరిగేషన్ 62.20 లక్షలు , ఆర్ అండ్ బి 51 లక్షలు , పంచాయతీరాజ్ 34.8 లక్షలు, ఈ ఈ ఏం బి ఇన్ ఫ్రా 15 లక్షలు , ఆర్టీసీ 17 లక్షలు , డిపిఓ 97.42 లక్షలు, ఎండోమెంట్ 67.74 లక్షలు, డీఎఫ్ఓ 5.92 లక్షలు, సబ్ కలెక్టర్ 15 లక్షలు, అటవీ శాఖ 30 లక్షలు, ఎస్పీ 1.25 కోట్లు, కలెక్టర్ 6 కోట్లు, క్షేత్ర కన్సల్టెన్సీ 17.70 లక్షలు నిధులు మంజూరయ్యాయి. మే 21 నుంచి జూన్ 1 వరకు జరిగే అంత్యపుష్కరాల నిర్వాణకు రాష్ట్ర ప్రభుత్వం , అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులను సమన్వయం చేస్తూ 33 ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసింది. పుష్కరాలలో పాల్గొనే సిబ్బందిని మూడు షిఫ్టులుగా విభజించారు.మొదటి షిఫ్ట్ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు , రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు , మూడవ షిఫ్ట్ రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల ఉండనుంది. ప్రతి షిఫ్ట్ అధికారి తమ తదుపరి షిఫ్ట్ అధికారికి బాధ్యతలు అప్పగించిన తర్వాతే తమ విధులనుండి రిలీవ్ కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆలయ పరిసరాలన్నింటినీ ఐదు జోన్లు ,18 సెక్టార్లుగా విభజించారు. ప్రతి సెక్టార్కు ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించారు. 27 తాత్కాలిక టాయిలెట్ల బ్లాకులు, 40 తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పారిశుద్ధ్య కార్మికులు , ట్రాక్టర్లు, క్లీనింగ్ యంత్రాలతో నిరంతరం పారిశుద్ధ్య పనులను నిర్వహించనున్నారు. పుష్కర ఘాట్లు , క్యూలైన్లు , పార్కింగ్ స్థలాలను నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. వైద్య సేవల కోసం పది మెడికల్ క్యాంపులు, 4 అంబులెన్సులు సిద్ధం చేశారు. పుష్కరాల్లో ఉన్న సిబ్బంది మే 20 వ తేదీ ఉదయం 10:30 గంటలకు కాళేశ్వరం లోని హరిత హోటల్ వద్ద కలెక్టర్ కు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై శాఖాభరమైన చర్యలు తీసుకుంటామని తెలి పారు. పుష్కరాల విధుల్లో ఉండే సిబ్బందికి మే 20వ తేదీ ఉదయం 10 గంటలకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గోదావరి నదిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి నిరంతరం బోట్ల ద్వారా పర్యవేక్షించనున్నారు. సరస్వతి ఘాటు వద్ద భారీ సెట్టింగ్ లతో బాహుబలి తరహాలో నిర్మాణాలు చేపట్టారు. టెంట్ సిటీ , డార్మెటరీ పనులు జరుగుతున్నాయి. ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన శివ కళ్యాణ మండపంలో భారీ సెట్టింగ్లతో నిత్యం హోమాలు నిర్మించ దానికి అవసరమైన చర్యలు చేపట్టారు. కాళేశ్వరం లోని పలు ప్రాంతాల్లో సుమారు 250 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో కుదురుపల్లి బీరాసాగర్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. సరస్వతి ఘాట్ మెట్ల వద్ద నుంచి నది వరకు వాహనాలు వెళ్లే విధంగా మట్టి రోడ్డు నిర్మించారు. పుష్కరాలు జరిగే 12 రోజులు సరస్వతి ఘాట్ వద్ద కాశి వేద పండితులతో సరస్వతి హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం 200 కోట్లు కేటాయించడంతో పుష్కరాల అనంతరం ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. సాధారణ ఘాటు వద్ద బండలను, పిచ్చి మొక్కలను తొలగించి మట్టిని చదును చేసి టెంట్ లు వేస్తున్నారు. సాధారణ ఘాట్ వద్ద నుంచి సరస్వతి ఘాట్ వరకు నది తీరంలో మట్టి రోడ్డు నిర్మించారు. ఒడ్డు పైన కంకర చిప్స్ తో రోడ్డు నిర్మాణం చేసి హెలిపాడ్ ను ఏర్పాటు చేశారు. ఆలయం బయట , నది తీరం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్థానికులు ఘాటు ల వద్దకు చేరుకునేలా వారి వాహనాలను అనుమతించాలని , ఆలయంలో దర్శన సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.1 కోటి 20 లక్షలతో నిర్మాణం చేపట్టిన మ్యూజియం పనులు చివరి దశకు చేరాయి.అంత్య పుష్కరాలలో ఈ మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.పురాతన విగ్రహాలను ఈ మ్యూజియం లో భద్రపరిచి భక్తులు సాధారణ రుసుముతో మ్యూజియం సందర్శించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

# ముదిరాజ్ వర్గానికి న్యాయం చేయాలి

- తెలంగాణ విద్యా సంతుల వేదిక
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ముదిరాజ్ వర్గం తీవ్ర వెనుకబాటుతనం
- బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి వెంటనే మార్పు చేయాలని డిమాండ్
- ముదిరాజ్ సింహావిలోకనం రాష్ట్రస్థాయి సమాలోచన సదస్సుకు ఏర్పాట్లు




**హైదరాబాద్, మే 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ముదిరాజ్, ముత్తరాసి, తెనుగోళ్ల వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని తెలంగాణ విద్యా సంతుల వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఐదు దశాబ్దాలపాటు ముదిరాజ్ సామాజిక వర్గం తీవ్ర అంచివేత, విస్మరణకు గురైందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితుల్లో పెద్ద మార్పు రాలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి అమరుడైన పోలీసు కిష్టయ్య బలిదానాన్ని ప్రభుత్వాలు గుర్తించలేదని విమర్శించారు. ఎస్ఈఈ ఈపీసీ -2025 కులాలవారీ జనాభా లెక్కల విశ్లేషణలో ముదిరాజ్ వర్గం వెనుకబాటుతనం అధికారికంగా బయటపడిందన్నారు. పాలనలో ఎన్నికల టికెట్ల కేటాయింపులో, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ముదిరాజ్ వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ ప్రయోజనాలు కూడా ముదిరాజ్ ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని, విద్యారంగంలో డ్రాపవుట్ల శాతం అధికంగా ఉందని తెలిపారు. మత్స్యరంగంలో ఆదాయాలు తగ్గిపోవడంతో అనేక కుటుంబాలు దినసరి కూలీలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. సమ్మిళిత వెనకబాటుతనం సూచికలో రాష్ట్ర స్థాయి 81గా ఉండగా, ముదిరాజ్ వర్గం 94 పాయింట్లతో అత్యంత వెనుకబడిన వర్గంగా నమోదైందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం సుమారు రూ.4 లక్షలు ఉండగా, ముదిరాజ్ ప్రజల తలసరి ఆదాయం రూ.1 లక్షలోపే ఉందని వెల్లడించారు. రాష్ట్ర ఖజానాకు ముదిరాజ్ ప్రజలు 8 పైసలు ఆదాయంగా సమకూరుస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఖర్చులో వారికి 3 పైసలు కూడా అందడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ-డీ నుంచి బీసీ-ఏ రిజర్వేషన్ మార్పు హామీ ఇప్పటివరకు అమలుకాలేదని,

"ముదిరాజ్ సింహావిలోకనం" సదస్సు 26న "ముదిరాజ్ సింహావిలోకనం" పేరుతో రాష్ట్రస్థాయి సమాలోచన సదస్సును ఈ నెల 26న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని గ్రాండ్ లాన్స్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సోషియల్ ఫిలాసఫర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ టీ. చిరంజీవులు, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ శివ కేశవులు ముదిరాజ్ పాల్గొంటారు. ఈ సందర్భంగా పిట్టల రవీందర్ రచించిన "ముదిరాజ్ ముఖచిత్రం" పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. సదస్సుకు ప్రొఫెసర్ సిహెచ్ దినేష్ కుమార్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా డాక్టర్ జూలు నాగేశ్వర్ ముదిరాజ్, డాక్టర్ కావలి చెన్నయ్య ముదిరాజ్ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే కృష్ణ కిషోర్ ముదిరాజ్, పూల నాగరాజు, పిల్ల కిరణ్ ముదిరాజ్, డి.కె. మల్వర్ తదితరులు పాల్గొంటున్నారు.

# యువతి దారుణ హత్య

### ప్రేమోన్మాద కిరాతకం

**జడ్చర్ల, మే 16 (జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో శనివారం అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్న ఒక ఉన్మాది, విధులను ముగించుకుని ఇంటికి తిరిగొస్తున్న యువతిని కాపుకాసి మరీ కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డ ప్రాంతానికి చెందిన వైష్ణవి (22) పోలేపల్లి సెజ్ లోని పాఠశాలలో ఉద్యోగం చేస్తోంది. హైదరాబాద్‌కు చెందిన యువకుడు గత కొంతకాలంగా ఆమెను ప్రేమ పేరుతో తీవ్రంగా వేధిస్తున్నట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం వైష్ణవి తన విధులను ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ఆమె ఇంటి సమీపంలోనే నిందితుడు పొంచి ఉండి. ఆమె రాగానే ఒక్కసారిగా కత్తితో విచక్షణారహితంగా దాడికి తెగబడినట్లు తెలిపారు. యువతి గొంతు, కడుపు భాగాల్లో తీవ్రంగా పొడవడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావమై, అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఇది గమనించిన స్థానికులు పారిపోతున్న యువకుడిని పట్టుకొని తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడ్డ యువకుడిని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు..

# నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

- నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి
- మంత్రి సీతక్క సూచన




**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిందని. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవా లని ఆకాంక్షిస్తున్నానని మంత్రి సీతక్క వెల్లడించారు.

# ఆక్టోపస్ కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** విధి నిర్వహణలో ప్రమాదానికి గురై కోమా స్థితిలో చికిత్స పొందుతున్న ఆక్టోపస్ కానిస్టేబుల్ జి. రజనీకాంత్ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద రూ. 64,00,000 బీమా పరిహారం మంజూరైంది. బేగంపేటలోని ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో.. డిజి ,(ఆపరేషన్స్) డాక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కానిస్టేబుల్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. టి.జి.ఎస్.పి 3వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ జి. రజనీకాంత్.. జనవరి 8, 2025 నుండి ఆక్టోపస్‌లో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది అక్టోబర్ 2వ తేదీన ఇబ్రహీంపట్నంలోని కమాండో ట్రైనింగ్ సెంటర్‌లో ఆపరేషనల్ విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా.. ఉదయం 11.55 గంటల సమయంలో మోటార్ సైకిలిస్ట్ ఢీకొనడంతో రజనీకాంత్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్పందించిన సిబ్బంది ఆయన్ను ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. న్యూరో సర్జన్ ఆధ్వర్యంలో రజనీకాంత్‌కు తలకు శస్త్రచికిత్స (స్కల్ ఫ్లాప్ సర్జరీ) జరిగింది. ప్రస్తుతం ఆయన సెమీ అన్ కాన్షియస్ స్టేట్ (పాక్షిక అపస్మారక స్థితి) లో ఉండటంతో, బంజారాహిల్స్‌లోని రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీ, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అక్టోబర్ 2వ తేదీ రాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 573/2025 కింద కేసు నమోదైంది. రజనీకాంత్‌కు మొయినాబాద్ ఎస్‌బీఐ శాఖలో 'పోలీస్ శాలరీ సిల్వర్ ప్యాకేజీ' అకౌంట్ ఉంది. దీనికి ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఒప్పందం ఉంది. కానిస్టేబుల్ పరిస్థితిని గమనించిన ఆక్టోపస్ డీజీ డాక్టర్ అనిల్ కుమార్ .. వెంటనే స్పందించి ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆక్టోపస్ ఎస్పీ (అడ్మిన్) ఎం. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో.. బ్రావో స్వాట్ టీమ్ డీఎస్పీ పి. విజయ్ కుమార్, బేగంపేట హెడ్‌క్వార్టర్స్ ఇన్‌స్పెక్టర్ (కమ్యూనికేషన్స్) బి. శ్రీనివాసరావు నిరంతరం బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియ పూర్తి చేశారు. దీనితో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి రూ. 64 లక్షల క్లెయిమ్ మంజూరైంది. మంజూరైన రూ. 64 లక్షల చెక్కును డీజీ డాక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా రజనీకాంత్ తండ్రి కొమరయ్య, తల్లి నాగమణి, సోదరుడు నరేష్, సోదరి శిరీషలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ ఎస్పీ (అడ్మిన్) ఎం. వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బి. రఘునందన్ రావు, ట్రైనింగ్ కన్సల్టెంట్ కల్నల్ భరత్ ప్రసాద్, డీఎస్పీలు, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు నరేందర్ చౌదరి, నందన్, ఆనంద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 మే 2026

# బేటీ బచావో.. కానీ ఎవరి బేటీని?

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పోక్సో చట్టం కింద నమోదైన ఆరోపణలు కేవలం ఒక కుటుంబ వ్యవహారంగా కొట్టిపారేయలేము. ఇది రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక మంత్రికి అందులోనూ అంతర్గత భద్రతను పర్యవేక్షించే మంత్రికి నైతిక జవాబుదారీతనం అడిగే సందర్భం. భగీరథ లొంగుబాటు జరిగింది. కేసు నమోదైంది. న్యాయప్రక్రియ మొదలైంది. కానీ సంజయ్ మాత్రం తన పదవిలో కొనసాగుతున్నారు. ఇక్కడే ఓ ప్రశ్న తలెత్తుతోంది. నైతిక బాధ్యత అనే మాట మన రాజకీయ నిఘంటువులో ఉందా? లేదా అది ఎంచుకోవడానికి అనువైన వస్తువుగా మారిందా?

హోంశాఖ సహాయ మంత్రి పదవి సాధారణ మంత్రిత్వ శాఖ కాదు. దేశ అంతర్గత భద్రత, మహిళా రక్షణ, బాలల సంరక్షణ ఇవన్నీ ఈ శాఖ పరిధిలోకే వస్తాయి. పోక్సో చట్టం అమలు, బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక నేరాలపై కఠిన చర్యలు వీటన్నింటికీ నేరుగా లేదా పరోక్షంగా హోంశాఖ బాధ్యత వహిస్తుంది. ఇలాంటి పదవిలో ఉన్న వ్యక్తి తనయుడిపై పోక్సో కేసు నమోదవడం ఒక్క వ్యక్తిగత విషాదం కాదు. అది ఆ పదవి గౌరవానికే సంబంధించిన సమస్య. పదవి, ఆరోపణల స్వభావం మధ్య ఉన్న వైరుధ్యం అసాధారణమైనది. అయితే భారత రాజకీయ చరిత్రలో నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. 1956లో లాల్ బహదూర్ శాస్త్రి రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు అర్రియలూరు రైలు ప్రమాదంలో 150 మంది మరణించారు. తన శాఖ పరిధిలో జరిగిన ఈ విపత్తుకు నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా రాజీనామా సమర్పించారు. నెహ్రూ అభ్యర్థన మేరకు వెనక్కి తీసుకున్నారు కానీ ఆ చర్య ఆయన నైతిక స్థాయికి నిదర్శనంగా నిలిచింది. 1963లో కె కామరాజ్ తమిళనాడు ముఖ్యమంత్రి పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి పార్టీ బలోపేతానికి వెళ్ళారు. కామరాజ్ ప్లాన్ అంటే పదవి కంటే సేవను ముందు పెట్టిన చరిత్ర. అదేవిధంగా 2005లో బీహార్ రాష్ట్రపతి పాలన సిఫారసు వివాదంలో హోంమంత్రిగా బూటాసింగ్ నైతిక బాధ్యత వహి ంచారు. ఏ.కె. ఆంటోనీ కూడా కేరళ మద్యపాన విధాన వైఫల్యానికి రాజీనామా చేశారు. గెలిచినా ఓడినా నైతికత వదలలేదు అని చరిత్ర నమోదు చేసింది. ఈ వ్యక్తులు చేసిన రాజీనామాలు కేవలం ఒత్తిడికి తలొగ్గిన చర్యలు కాదు. అవి రాజకీయ నైతికతకు జీవం పోసిన క్షణాలు.

> ఇప్పుడు మహిళలు, అమ్మాయిల రక్షణ విషయానికొద్దాం. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హరియాణాలో ప్రారంభించిన "బేటీ బచావో బేటీ పడావో" పథకం ఒక చారిత్రాత్మక నినాదం. ఆడపిల్లలను రక్షించాలి, వారికి విద్య కల్పించాలి, వారిని గౌరవించాలి ఇదీ ఆ పథకం సారాంశం. కానీ నేడు ఆ పార్టీకి చెందిన నేత తనయుడిపై పోక్సో కేసు నమోదైనప్పుడు ఆ నినాదం డొల్లగా మారదా? 'బేటీ బచావో" అంటే ఏ బేటీని? అధికారంలో ఉన్నవారి కూతుళ్ళను మాత్రమేనా? సామాన్య కుటుంబాల అమ్మాయిలకు రక్షణ కల్పించే చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలో ఉన్న వ్యక్తి ఆ చట్టం ఉల్లంఘన ఆరోపణ ఎదుర్కొంటున్న తన కుమారుడికి తండ్రిగా నిలబడటం వేరు, మంత్రిగా కొనసాగడం వేరు. నినాదం నిజాయితీగా ఉండాలంటే ముందు నైతికత నిజాయితీగా ఉండాలి.

ఇక్కడ మరో ముఖ్యమైన స్పష్టత అవసరం. భగీరథ నేరస్తుడని ఇప్పుడే తీర్పు చెప్పడం లేదు. న్యాయస్థానం నిర్ణయిస్తుంది. అది న్యాయప్రక్రియ. కానీ నైతికత వేరే ప్రశ్న అడుగుతుంది: ఇలాంటి సందర్భంలో పదవిలో కొనసాగ డం తగునా? లాల్ బహదూర్ శాస్త్రి రైలు ప్రమాదానికి వ్యక్తిగతంగా బాధ్యుడు కాదు. కానీ శాఖాధిపతిగా నైతిక బాధ్యత వహించారు. అదే కొలమానం నేడూ వర్తించాలి కదా? అంతర్గత భద్రతను పర్యవేక్షించే మంత్రి, తన ఇంటిలోనే ఒక బాలికకు రక్షణ కల్పించలేకపోయారని ఆరోపణ వచ్చినప్పుడు పదవిలో కొనసాగడం పదవికే అవమానం కాదా? ప్రజాస్వామ్యం కేవలం ఓట్లతో నడిచే వ్యవస్థ కాదు. అది నైతికతపై నిర్మించబడిన వ్యవస్థ. ఆ నైతికత క్రమక్రమంగా కోల్పోతే ప్రజలకు పదవులు, పార్టీలు మాత్రమే మిగులుతాయి. విశ్వాసం మిగలదు. విపక్షాలు చేస్తున్న డిమాండ్ కేవలం రాజకీయ వ్యూహం కాదు అది ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని బతికించుకోవాలని చేసే నినాదం. బండి సంజయ్ రాజీనామా చేయాలా వద్దా అని వారే నిర్ణయించుకోవాలి. కానీ చరిత్ర ఎప్పుడైనా నైతికత దారితో నడిచిన వారి గుర్తుచేస్తుంది. మిగతావారిని గుర్తుపెట్టుకోవడానికి కూడా ఇష్టపడదు. బేటీ బచావో అంటే మాటలతో కాదు మనసుతో, నైతికతో, చర్యలతో బచావో..!

# విజయ్ విజయం వెనుక "తెలంగాణ మోడల్"

## రేవంత్ రెడ్డి ఎన్నికల స్ట్రాటజీనే టీవీకే అమలు

సాదిక్
సినియర్ జర్నలిస్టు
8179221604

తమిళనాడు రాజకీయాల్లో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అధికారంలోకి రావడం దక్షిణ భారత రాజకీయాల్లో భారీ సంచలనం. విజయ్ విజయం వెనుక అసలు బ్లూప్రింట్ హైదరాబాద్‌లో తయారయిందని, ఎన్నికలకు ఏడాది ముందునుండే ఇక్కడి వ్యూహాన్ని పక్కాగా అక్కడ అమలు చేశారని చర్చ జరుగుతుంది. ఎన్నికల ప్రచారం నుంచి ప్రమాణ స్వీకారం వరకు విజయ్ తీసుకున్న ప్రతి అడుగులోనూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్టైల్ కనిపించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం కొన్ని ఐడియాలు కాదు... మొత్తం ప్రచార నిర్మాణం, నాయకుడి ఇమేజ్ బిల్డింగ్, సభల రూపకల్పన, ప్రజల్లోకి వెళ్లే నినాదాలు, విజువల్ పొలిటిక్స్ వరకు అన్నింటిలోనూ "తెలంగాణ మోడల్" ప్రభావం స్పష్టంగా కనిపించిందనే అభిప్రాయం బలపడుతోంది.

### డ్రెస్సింగ్ స్టైల్‌లోనూ సారూప్యతలు.

రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఎక్కువగా కనిపించిన లుక్ : తెలుపు షర్ట్, బ్లాక్ ప్యాంట్ సాధారణ కామన్ మాన్ స్టైల్...హడావిడి లేని బాడీ లాంగ్వేజ్...జనాల్లో కలిసిపోయే ఇమేజ్. విజయ్ కూడా ప్రచారంలో ఇదే ఫార్మాట్ స్పష్టంగా కనపడింది. సినీ హీరోలకు సాధారణంగా ఉండే గ్లామర్ డ్రెస్సింగ్‌ను పక్కన పెట్టి, ప్లైన్ వైట్ షర్ట్స్ వేసుకొని, చేతులు మడిచిన లుక్‌తో...క్రౌడ్ మధ్య నడుస్తూ ఉండే విధానం అంత అందుబాటులో ఉండే నాయకుడు ఇమేజ్‌ను బలపరిచాయి.

ప్రచార రథాల డిజైన్ కూడా ఒకే తరహా. తెలంగాణ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రచార రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 360 డిగ్రీ విజిబిలిటీ, క్రౌడ్ కనెక్ట్ అయ్యేవిధంగా ఓపెన్ స్ట్రక్చర్, కెమెరాలకు పర్ఫెక్ట్ లుక్ ఉండేట్లు, డ్రోన్ షాట్స్‌కు అనుకూల డిజైన్. తమిళనాడులో విజయ్ రోడ్ షో వాహనాల్లో కూడా ఇదే స్టైల్ కనిపించిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. పైభాగంలో నిలబడి వేవ్ చేయడం...వెనుక భారీ LED విజ్యువల్స్, క్లోజ్ క్రౌడ్ ఇంటరాక్షన్...కంట్రోల్డ్ కెమెరా ఫ్రేమింగ్ దాదాపుగా ఒకే తరహాలో ఉన్నాయి. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా ప్రత్యేకంగా




డిజైన్ చేసిన ప్రచార మోడల్ అని చర్చించుకుంటున్నారు.
సభల స్టేజ్ డిజైన్‌లో కూడా "హైదరాబాద్ టచ్" స్పష్టంగా కనిపించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభల్లో కనిపించిన "Leader-Centric Visual Politics" మోడల్‌ను తమిళనాడులో విజయ్ ప్రచారంలోనూ అమలు చేసినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సభల్లో భారీ కటౌట్ల కంటే లైవ్ విజువల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం, లైటింగ్, ఎమోషనల్ క్రౌడ్ షాట్స్, డ్రోన్ సినిమాటోగ్రఫీ, సోషల్ మీడియా ఫ్రెండ్లీ స్టేజ్ యాంగిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇవన్నీ కలిసి సంప్రదాయ రాజకీయ సభల కంటే భిన్నమైన వాతావరణాన్ని సృష్టించాయి.
ఇక సోషల్ మీడియా ప్రచారంలో కూడా రెండు క్యాంపెయిన్ల మధ్య స్పష్టమైన పోలికలు కనిపించాయి. రేవంత్ రెడ్డి ప్రచారంలో డిజిటల్ క్యాంపెయిన్ కీలక పాత్ర పోషించగా, ప్రతి సభ, ప్రతి పంచ్ డైలాగ్, ప్రతి ఎమోషనల్ మూమెంట్ ను షార్ట్ రీల్స్, వైరల్ క్లిప్స్, యూత్ టార్గెటెడ్ ఎడిట్స్ రూపంలో ఎగ్రెసివ్ గా పుష్ చేశారు. ఇదే తరహాలో విజయ్ ఎన్నికల ప్రచారంలోనూ 30 సెకండ్ల ఎమోషనల్ రీల్స్, సినిమాటిక్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, క్రౌడ్ రోర్ ఎడిట్స్, "నెక్స్ట్ సీఎం" ప్రొజెక్షన్ వీడియోలు విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో సంప్రదాయ మీడియా కంటే సోషల్ మీడియాను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్న కొత్త ప్రచార మోడల్ దక్షిణ భారత రాజకీయాల్లో బలపడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
ప్రమాణ స్వీకారం తర్వాత కూడా తమిళనాడులో కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ రాజకీయాలను గుర్తు చేశాయి.

తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు పథకం తొలి ఫైల్‌పై అక్కడికక్కడే సంతకం చేయడం ద్వారా "ప్రజల ప్రభుత్వం" అనే రాజకీయ సందేశాన్ని బలంగా పంపించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతౌల్యంగా ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వ దిశను ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఇదే తరహాలో తమిళనాడులో విజయ్ కూడా ప్రమాణ స్వీకారం అనంతరం ఉచిత విద్యుత్ ఫైల్ పై సంతకం చేయటం తో తన పాలనకు శ్రీకారం చుట్టారు. తొలి ఫైల్ క్లియరెన్స్ నుంచే పరిపాలనలో వేగం చూపించే ప్రయత్నం చేయడంతో పాటు, "ఇది ప్రజల ప్రభుత్వం" అనే సంకేతాన్ని రాజకీయంగా బలంగా ప్రొజెక్ట్ చేశారు. ఇద్దరు నేతలు ప్రమాణ స్వీకారం అనంతరం నేరుగా సెక్రటేరియట్ కు వెళ్లి అధికారులతో సమావేశం అయ్యారు.
విజయ్ విజయం కేవలం స్టార్ ఇమేజ్ వల్ల వచ్చిన ఫలితం కాదని స్పష్టంగా కనపడుతుంది. ఆయన వెనుక పక్కాగా రూపొందించిన ఎన్నికల వ్యూహం, నియంత్రిత రాజకీయ సందేశాలు, దూకుడైన డిజిటల్ ప్రచారం, ప్రజల్లో భావోద్వేగ అనుసంధానం సృష్టించే కమ్యూనికేషన్ మోడల్ పనిచేశాయని అర్థమవుతుంది. ముఖ్యంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో కనిపించిన శైలి, ప్రచార నిర్మాణం, సోషల్ మీడియా వ్యూహాలకు దగ్గర పోలికలు విజయ్ క్యాంపెయిన్ లోనూ కనిపిస్తుంది. ఎవరైతే రేవంత్‌కు కాంపెయిన్‌కు పనిచేసారో ఆ టీం అక్కడ పని చేసినట్లుగా చెపుతున్నారు. రేవంత్ కాంపెయిన్ భాద్యతలు పూర్తిగా చూసుకున్న అయనే.... విజయ్ కాంపెయిన్ ను సైతం డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఎదైనా అనాడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి భాద్యత చేపట్టగానే గత ప్రభుత్వం వాస్తవాలు ప్రజలకు వివరిస్తు పాలన మోదలు పెట్టారు. అదే తరహాలో విజయ్ సయితం ఆ రాష్ట్రంలోని అప్పులు,పాలనపై స్వేత పత్రం రూపంలో ప్రకటించడం చూస్తే తెలంగాణ మోడల్ కనపడుతోంది.

# తెలంగాణ ఏర్పాటు ఎందుకు ఆలస్యమైంది?

1. ఇండియన్ యూనియన్‌లో నైజాం రాజ్యాన్ని కలిపినపుడు స్టేటస్ కో అన్నారు. 1948 సెప్టెంబర్ 17 అధికారికంగా కలిపారు. నైజాం రాజ్య విస్తీర్ణం, జనాభా ప్రకారం భారత రాజ్యాంగ పరిషత్ లో 18 మందిని లేదా కనీసం పది మందిని కో అప్ట చేసుకోవాలి. చాలా సంస్థానాల నుండి అలా ఎన్నికయ్యారు. నైజాం భారత రాజ్యాంగమే ్షకు కూడా ఒకే అన్నారు. అది నిజమే గానీ రాజ్యాంగ పరిషత్ లో ప్రాతినిధ్యం ఉండాలి కదా! స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కెవి రంగారెడ్డి, మాడపాటి హన్మంతరావు తదితర పెద్దలకు ఎందుకు తోచలేదు?
ఎందుకు అడగ లేదు. ఇది మొదటి పొరపాటు . రాజ్యాంగ పరిషత్ ల చేరి ్నంటే కాశ్మీరి కున్న 371 ఆర్టికల్ కింద మనకు కూడా రక్షణలుండేవి. 1956 ఫిబ్రవరిలో ఆంధ్ర తెలంగాణ పెద్దమనుషుల ఒప్పందం చేసుకునేటప్పైనా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను సంప్రదించావుంటే 371 ఆర్టికల్ కింద చేర్చడానికి రాజ్యాంగ సవరణ చేసి వుండేవారు. చివరకు 1969 ఉద్యమం తరువాత ముల్కీ స్థానికుల రక్షణ క్లాజులు 371 డి కిందే చేర్చబడ్డాయి. ఎంతమంది హైకోర్టు అడ్వొకేట్లు ఉండగా 1956 ఒప్పందానికి రాజ్యాంగ రక్షణ సాధించక పోవడం రెండవ చారిత్రక తప్పిదం. 1969 ఉద్యమంతో గెలిచిన డా. మర్రి చెన్నారెడ్డి, వారి సహచర యంపీ లు కాంగ్రెస్‌లో చేరడం రీడవ చారిత్రక తప్పిదం. అలా అలసిపోయినా యువత ఈ వ్యవస్థను మార్చారని నక్సలైట్ ఉద్యమ బాట పట్టడానికి కారకులైనారు. 19978 నుండి కాంగ్రెస్ లో ఇండిపెండెంట్ నాయకుల స్థానంలో డిపెండెంట్ నాయకత్వం కొనసాగుతున్నాయి. అధిష్టానమా అధీనులే తప్ప వీరు స్వయం ప్రకాశితులు కారు.

అటు తరువాత 2004 ఎన్నికల్లో కాంగ్రెస్–టీఆర్ఎస్ కూటమి ఘనవిజయం సాధించిన తర్వాత, 2004–2005 మధ్య కాలంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సి ఉండింది. రెండో ఎస్సార్సీ లేకుండా అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. చత్తీస్ గడ్, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, కష్టాలు ఏర్పడ్డాయి. తెలంగాణ కూడ అలాగే ఏర్పాటు చేయాలి. కానీ, ఉమ్మడి పాలకుల కుట్రలు, రాజకీయ స్వార్థం కారణంగా అది సాధ్యం కాలేదు. ఆనాడు తెలంగాణను అడ్డుకున్న శక్తులు, వై.ఎస్. రాజశేఖర రెడ్డి (వై=) పాత్ర, కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాలు మరియు సీమాంధ్ర పెట్టుబడిదారుల స్వార్థం పై చారిత్రక సమాచారం విశ్లేషణతో కూడిన విస్తృతమైన వివరణ:

**2. వై.ఎస్. రాజశేఖర రెడ్డి పాత్ర -- వ్యూహాత్మక అడ్డుకట్ట**

– 2004లో ముఖ్యమంత్రి అయిన వై.ఎస్. రాజశేఖర రెడ్డి మలిదశ ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసి, తెలంగాణ ఏర్పాటును అత్యంత చాణక్యంగా అడ్డుకున్న ప్రధాన శక్తులలో మొదటివారు..
పొత్తుల వరకే సెంటిమెంట్: 2004 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి కేసీఆర్ క్రేజ్‌ను, తెలంగాణ సెంటిమెంట్‌ను వైఎస్ఆర్ వాడుకున్నారు. కానీ అధికారంలోకి రాగానే ఆయన అసలు రంగు బయటపడింది. తెలంగాణ ఇస్తే హైదరాబాద్ లాంటి మహా నగరాన్ని, రాష్ట్రాన్ని కోల్పోతామని ఆయన భావించారు.
**తెలంగాణ కాంగ్రెస్ నేతల నోళ్లు నొక్కడం:** కాంగ్రెస్‌లో ఉంటూ ప్రత్యేక రాష్ట్రం కోరుతున్న , దామోదర రాజనర్సింహ, జానారెడ్డి వంటి నాయకులకు మంత్రి పదవులు ఇచ్చి, వారి తెలంగాణ గళాన్ని నొక్కేశారు.
**'సమైక్య' సెంటిమెంట్‌ను రగల్చడం:** తెలంగాణ సెంటిమెంట్‌కు కౌంటర్‌గా సీమాంధ్ర ప్రజల్లో "తెలుగువారి ఐక్యత" అనే భావనను వైఎస్ఆర్ తెరపైకి తెచ్చారు. రాష్ట్రం విడిపోతే రాయలసీమ ఎడారి అవుతుందని, కోస్తాకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేయించారు.
**పోతిరెడ్డిపాడు ద్వారా జల దోపిడీ:** వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఈ కాలంలోనే (2005లో) కృష్ణా జలాలను రాయలసీమకు తరలించడానికి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని అక్రమంగా పెంచే జీవో తెచ్చారు. దీనిని ప్రశ్నించిన టీఆర్ఎస్ మంత్రులను కేబినెట్‌లో ఒంటరిని చేశారు

**3. కాంగ్రెస్ అధిష్ఠానం పాత్ర - కాలయాపన రాజకీయాలు**

ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం (సోనియా, ప్రణబ్ ముఖర్జీ) తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి, ఆ తర్వాత మాట తప్పి ద్రోహం చేసారు.
**యూపీఏ మేనిఫెస్టో డ్రామా:** 2004లో కేంద్రంలో ఏర్పడిన యూపీఏ-1 ప్రభుత్వ 'కనీస ఉమ్మడి ప్రణాళిక'లో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చారు. కానీ దానిని అమలు చేయడానికి ఇష్టపడలేదు.
**ప్రణబ్ ముఖర్జీ కమిటీ (2004 డిసెంబర్):** తెలంగాణ ఏర్పాటుపై ఏకాభిప్రాయం కోసం కాంగ్రెస్ అధిష్ఠానం ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో సబ్-కమిటీని వేసింది. ఇది కేవలం టీఆర్ఎస్‌ను శాంతింపజేయడానికి మరియు "కాలయాపన" చేయడానికి వేసిన కమిటీ మాత్రమే.
**మిత్రపక్షాల వంక:** దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు లేఖలు ఇస్తేనే తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ కొత్త నిబంధన పెట్టింది. సీపీఎం లాంటి సమైక్యవాద పార్టీల అభ్యంతరాలను సాకుగా చూపిస్తూ సోనియా గాంధీ కాలం గడిపారు.

**4. సీమాంధ్ర పెట్టుబడిదారుల స్వార్థం, లాబీయింగ్**

2004 నాటికి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్, ఐటీ రంగం ఊపందుకున్నాయి. తెలంగాణ ఇస్తే తమ సామ్రాజ్యాలు కూలిపోతాయని సీమాంధ్ర బడా బాబులు భయపడ్డారు.
**హైదరాబాద్‌పై కన్ను:** ల్యాండ్ బ్యాంకులు, ఫిల్మ్ నగర్, కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలన్నీ ఆంధ్రా పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రం విడిపోతే హైదరాబాద్‌లో తమ ఆస్తులకు రక్షణ ఉండదని ప్రచారం చేసారు.
**ఢిల్లీలో లాబీయింగ్ :** లగడపాటి రాజగోపాల్ (ల్యాంకో గ్రూప్), కావూరి సాంబశివరావు వంటి బడా సీమాంధ్ర కాంగ్రెస్ ఎంపీలు, కాంట్రాక్టర్లు సోనియా గాంధీ, అహ్మద్ పటేల్ చుట్టూ చేరి కోట్లాది రూపాయల పెట్టుబడుల లాబీయింగ్ నడిపారు. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బెదిరించారు.

**5. వైఎస్ఆర్ మైండ్ గేమ్ - కేసీఆర్‌ను దెబ్బతీయడం (2005)**

వైఎస్ఆర్ తన రాజకీయ చతురతతో టీఆర్ఎస్ పార్టీని లోపలి నుండే నిర్వీర్యం చేయాలని చూశారు.
**టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు:** కేసీఆర్ వైఖరి నచ్చని కొందరు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆశ చూపి వైఎస్ఆర్ తన వైపు తిప్పుకున్నారు. టీఆర్ఎస్‌లో చీలిక తెచ్చి కేసీఆర్ ఒంటరివాడని ఢిల్లీకి సంకేతాలు పంపారు.
**పదవుల ఎర:** కేంద్రంలో కేసీఆర్ కేంద్ర నౌకాయాన మంత్రిగా, నరేంద్ర కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉన్నప్పటికీ, వారికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్ఠానం నలిపేసింది.

**6. 2004-2005 ద్రోహంపై 2026 నవ్య విశ్లేషణ**


"2004–2005 కాలం తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక 'పెద్ద ద్రోహ పూరిత ఘట్టం'. కాంగ్రెస్ అధిష్ఠానం అధికార స్వార్థం, వైఎస్ఆర్ సమైక్యవాద మైండ్ గేమ్, మరియు సీమాంధ్ర కాంట్రాక్టర్ల ఆర్థిక లాబీయింగ్... ఈ మూడూ కలిసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను తొక్కిపెట్టాయి. ఈ ద్రోహాన్ని భరించలేకే, చివరకు 2006లో టీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పొత్తుకు గుడ్ బై చెప్పి మళ్లీ ప్రజా క్షేత్రంలోకి వెళ్లాల్సి వచ్చింది. 2026 జూన్ 2న మనం చూస్తున్న తెలంగాణ... నాటి వైఎస్ఆర్ కుట్రలను, కాంగ్రెస్ ద్రోహాలను చీల్చుకుంటూ వచ్చిన ప్రజాశక్తి విజయం అని గుర్తుంచుకోవాలి. ఇలా ఇన్ని రకాల కారణాల రీత్యా దశాబ్దాల తరబడి తెలంగాణ ఏర్పాటు ఆలస్యమైంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# ప్రజాప్రతినిధుల వృథా ఖర్చులు - మారుతున్న రాజకీయ సంస్కృతి!

భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి దశ రాజకీయ వ్యవస్థలో ప్రజాసేవ, నిరాడంబర జీవనం, ప్రభుత్వ ధనంపై బాధ్యతాయుత వైఖరి ప్రధాన లక్షణాలుగా కనిపించాయి. అప్పటి నాయకులు అధికారాన్ని విలాసానికి కాకుండా సేవకు వినియోగించేవారు. ముఖ్యంగా 1950–1970 మధ్యకాలంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన అనేక మంది మంత్రులు పరిమిత సౌకర్యాలతోనే ప్రజా జీవితాన్ని కొనసాగించారు. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక అవసరాలకే వినియోగించడం ఆనా టి నైతిక రాజకీయ సంస్కృతిగా ఉండేది. దేశ రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన వ్యక్తిగత అవసరాలకు ప్రభుత్వ వాహనాన్ని వినియోగించకుండా ప్రజా ధనాన్ని పవిత్ర బాధ్యతగా భావించిన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. ఆయన కుటుంబ అవసరాలకు వాడిన కారుకు సంబంధించిన రుణాన్ని మరణానంత రం కూడా కుటుంబ సభ్యులు చెల్లించిన ఉదాహరణ రాజకీయ నైతికతకు ప్రతీకగా నిలిచింది.
1960లలో ఒక రాష్ట్ర మంత్రికి సాధారణంగా 1 అధికారిక కారు మాత్రమే కేటాయించబడేది. భద్రతా సిబ్బంది సంఖ్య కూడా చాలా తక్కువగా ఉండేది. ముఖ్యమంత్రుల వాహన దళంలో ఎక్కువగా 2 లేదా 3 వాహనాలు మాత్రమే ఉండేవి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కొనసాగించడం ప్రధాన లక్ష్యంగా ఉండేది. అయితే 1980ల తర్వా త రాజకీయ వ్యవస్థలో అధికార ప్రదర్శన పెరుగుతూ వచ్చింది. 1990లలో ఆర్థిక స్వేచ్ఛాకరణ తర్వాత రాజకీయ నాయకుల జీవనశైలిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యం గా అత్యున్నత వ్యక్తుల సంస్కృతి, భారీ వాహన దళాలు, అధిక భద్రతా వ్యవస్థలు ప్రభుత్వ ఖర్చులను పెంచే ప్రధాన అంశాలుగా మారాయి.
ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతిని ధులు 10 నుండి 30 వరకు వాహనాలతో కూడిన దళాల్లో తిరుగు తున్న పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల ముఖ్యమంత్రుల పర్యటనల సమయంలో 50కి పైగా వాహనాలు వినియోగించబడుతున్నాయని వివిధ నివేదికలు తెలియజేస్తున్నాయి. ఒక వాహన దళ ప్రయాణా నికి రోజుకు లక్షల రూపాయల వరకు ఇంధన వ్యయం జరుగుతోం దని ప్రభుత్వ అంచనాలు సూచిస్తున్నాయి. 2024 నాటికి దేశవ్యాప్తంగా అత్యున్నత భద్రత కోసం సంవత్సరానికి సుమారు రూ. 3,500 కోట్లకు పైగా వ్యయం అవుతోందని పలు విశ్లేషణలు తెలియజేశాయి. ఇందులో వాహనాల నిర్వహణ, ఇంధనం, భద్రతా సిబ్బంది, ప్రత్యేక పర్యటన ఏర్పాట్లు ప్రధాన భాగంగా ఉన్నాయి.
ఇక రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. 2025 నాటికి భారతదేశంలోని అనేక రాష్ట్రాల అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 30% నుండి 40% వరకు పెరిగినట్లు ఆర్థిక సర్వేలు తెలియజేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాప్రతినిధుల విలాసవంతమైన ప్రయాణాలు, భారీ వాహన




దళాలు, అధిక భద్రతా ఖర్చులు ప్రజలలో అసంతృప్తిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా సమస్యలు, వైద్య సదుపాయాల కొరత వంటి సమస్యలు పెరుగుతున్న సమయంలో ప్రజా ధనం వృథా అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలుమార్లు ప్రజాప్రతినిధులు వృథా ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. అత్యున్నత భద్రత కలిగిన ప్రధానమంత్రి పరిమిత వాహనాలతోనే పర్యటించడం ద్వారా సరళ జీవనానికి ఒక సందేశాన్ని ఇస్తున్నారని అనేక రాజకీ య విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ప్రధాన మంత్రి వాహన దళంలో భద్రతా ప్రమాణాల ప్రకారం ప్రత్యేక వాహనాలు ఉన్నప్పటికీ ప్రజల ముందు అధిక ప్రదర్శన లేకుండా నిర్వహించే విధానం ఇతర రాష్ట్ర నాయకులకు ఆదర్శంగా ఉండాలని సూచనలు వస్తున్నాయి.
భారతదేశంలో అత్యున్నత వ్యక్తుల సంస్కృతి కారణంగా రహదారి నిలిపివేతలు, ప్రజలకు ఇబ్బందులు, అత్యవసర సేవలకు ఆటంకాలు కూడా పెరుగుతున్నాయి. 2017లో భారత సుప్రీంకోర్టు ఎర్ర బత్తీల వినియోగంపై పరిమితులు విధించడం ప్రజాస్వామ్య సమానత్వానికి ఒక ముఖ్యమైన నిర్ణయంగా భావించబడింది. అయినప్పటికీ అధికార ప్రదర్శన పూర్తిగా తగ్గలేదని సామాజిక పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో నాయకు డు ప్రజల సేవకుడిగా ఉండాలే తప్ప రాజులా ప్రవర్తించకూడదనే భావన బలపడుతోంది.

1950–1970 కాలంలో రాజకీయ నాయకుల జీవనశైలిలో కనిపించిన నిరాడంబరత ప్రస్తుతం అరుదుగా మారింది. అప్పటి ప్రజాప్రతినిధులలో చాలామంది సాధారణ ఇళ్లలో నివసిస్తూ, పరిమిత భద్రతతో ప్రజల మధ్య తిరిగేవారు. ప్రస్తుతం మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే విలాసవంతమైన కార్యాలయాలు, కొత్త వాహనాలు, భారీ భద్రతా ఏర్పాట్లు, ప్రత్యేక విమాన ప్రయాణాలు సాధారణమైపోయాయి. 2023లో కొన్ని రాష్ట్రాలు ముఖ్యమంత్రుల కోసం రూ.50 కోట్లకు పైగా ఖర్చుతో ప్రత్యేక విమానాలు కొనుగోలు చేసిన విషయాలు చర్చనీయాంశమయ్యాయి.
రాజకీయ నాయకుల దుబారా ఖర్చుల ప్రభావం కేవలం ప్రభుత్వ ఖజానాపైనే కాదు, ప్రజాస్వామ్య విలువలపైనా పడుతోంది. ప్రజలలో రాజకీయాలపై నమ్మకం తగ్గడానికి ఇటువంటి ప్రదర్శనాత్మక రాజకీయ సంస్కృతి కూడా ఒక కారణంగా మారుతోంది. ప్రజాసేవకు వచ్చిన నాయకులు ప్రజల మాదిరిగానే సరళ జీవనం గడపాలని దేశ రాజ్యాంగ ఆత్మ సూచిస్తుంది. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన గ్రామస్వరాజ్యం భావనలో కూడా ప్రజాప్రతినిధి ప్రజలతో సమానంగా ఉండాలనే ఆలోచన ప్రధానంగా కనిపిస్తుంది.
ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు ఖర్చుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మంత్రుల వాహన దళాల పరిమితి, అధికారిక వాహనాల వినియోగ నియంత్రణ, ఇంధన వ్యయాల పర్యవేక్షణ, అవసరంలేని భద్రతా సిబ్బంది తగ్గింపు వంటి చర్యలు తీసుకుంటే సంవత్సరానికి వేల కోట్ల రూపాయలు ఆదా కావచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఆ ఆదాను ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి వంటి రంగాలకు మళ్లిస్తే సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుంది.
ముగింపుగా పరిశీలిస్తే స్వాతంత్ర్యానంతర భారతదేశ రాజకీయ వ్యవస్థలో కనిపించిన నైతిక విలువలు, నిరాడంబరత, ప్రజాధనంపై బాధ్యత భావన క్రమంగా తగ్గుతూ రావడం ఆందోళనకర విషయం. ఒకప్పుడు లాల్ బహదూర్ శాస్త్రి వంటి నాయకులు ప్రభుత్వ ఆస్తిని పవిత్ర బాధ్యతగా భావించగా, నేడు అనేక ప్రాంతాల్లో రాజకీయ వ్యవస్థ అధిక ప్రదర్శన, విలాసవంతమైన ఖర్చుల వైపు మళ్లింది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ప్రజాప్రతినిధులు మళ్లీ సరళ జీవన విధానాన్ని అలవరచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజా ధనం ప్రజల సంక్షేమానికే వినియోగించాలనే భావన బలపడినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య పరిపాలన సాధ్యమవుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## రెండు కన్నీటి బొట్లు

ఇప్పుడు నేను కాసిన్ని సానుభూతి
మాటలు చెప్పడం లేదు
రహదారి మీద నిలబడి
పోరాటం చేయడం లేదు
నాలో నేను బాధపడి
రెండు కన్నీటి బొట్లు కూడా
రాల్చడం లేదు
కానీ.... చుట్టూ లక్షలాది రాబందులు
తమ ఇనుపముక్కుల తోటి
సిద్ధంగా ఉన్న సంగతి ఎందుకు
గ్రహించలేకపోతున్నావనేది
నా ఆలోచన ??
ఆడజన్మకీ పదేళ్ల ప్రాయం
దాటితే చాలు!?
కళ్ళతోటే స్కానింగ్ చేసి
కామకేళి జరిపే తోడేళ్ల మధ్య నువ్వు ఉన్నావని
గుర్తుఎరుగకపోవడమే నేరమయిందేమో!?
నీ ఆనవాళ్ల మీద ఇంకొకరు
సంతకం చేయడం అంటే
నిన్ను చెల్లని కాగితాన్ని చేసి
వాళ్ళు చలామణి కావడమే!!
కొద్ది అవకాశం ఇచ్చావో!!
అందమైన నీ పాదాల కింద
వాడు సంతకం చేయడమే కాదు
నీదైన జీవితంలో నుండి నిన్ను కబ్జా చేసి
వాడి కంకాళాల్ని అక్షరాలుగా పేరుస్తాడు
ఇప్పుడొక కవిత రాసి
కలం ముడిచి నా బాధ్యత ముగిసిందని
అనుకోవడం కూడా నేరమే!!అవుతుంది...
చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టాలు
యెన్నున్నా
ఆడపిల్లల మీద అకృత్యాలు ఆగడం లేదు...
బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన
పాఠశాల విద్య నుంచే
ప్రారంభించి
ఇంటి దగ్గర అమ్మలు స్నేహితుల్లా మెలిగితేనే...
ఈ కన్నీటికి కొంత ఉపశమనం
దక్కుతుందేమో!!

అనిత కృష్ణ గండమళ్ళ

## తాపీ మేస్త్రీల గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి

- సెంట్రింగ్ కాంట్రాక్టర్ల నిరసన..
- అల్వాల్‌లో పనులు బంద్



అల్వాల్, మే 16 (జనంసాక్షి) : "తాపీ మేస్త్రీలను తొలగించాలి.. సెంట్రింగ్ కాంట్రాక్టర్లను ఆదుకోవాలి" అంటూ అల్వాల్ సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు గళమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం అల్వాల్‌లో భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసి నిరసన చేపట్టారు. స్థానిక అసోసియేషన్ భవనం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు ఎస్.కృష్ణ, మల్లేష్ యాదవ్, వై.కృష్ణ, ఆర్.నర్సింలు, జి.నరసయ్య, శివ కుమార్ ముదిరాజ్, రాజు రావు, పొన్నాల మల్లేష్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

- ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ



ఫరూక్‌నగర్, మే 16 (జనంసాక్షి) : ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు..ఈ సందర్భంగా శనివారం షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా పనిచేశామని ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం ఒక జేఏసీగా ఏర్పడి సాగునీటి కృషి సాధనకు సంకల్పించమని అదే విధంగా మొదటి మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా పెండింగ్ ప్రాజెక్టుల సైతం పరిశీలించమని,చాలా ఆందోళనకు గురయమని అన్నారు.బూర్గుల రామకృష్ణారావు తర్వాత తిరిగి ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగిన తరువాత మహబూబ్ నగర్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలో ఉండటాన్ని ఆశావహంగా అనుకున్నామనీ,సాగునీటి విషయమై నిర్దిష్టంగా మా ఆలోచనను మన ఉమ్మడి జిల్లా శాసనసభ్యుల ద్వారా మీ దృష్టికి తీసుకురావాలని సంకల్పించినామనీ తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యులకు, పార్లమెంటు సభ్యులకు ఈ లేఖలు అందజేస్తున్నామని మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి సమస్యలు తీరుస్తారని నమ్ముతున్నమని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నీళ్లు,నిధులు, నియామకాలు కీలక విషయాలుగా పనిచేసిందని తెలంగాణలోనే కాకుండా దేశమంతటా మహబూబ్ నగర్ కరువు,వలసలను,సాగునీటి ఎద్దడిని,ఆకలి చావులను,రైతుల ఆత్మహత్యలను విశేషంగా ప్రచారం చేసింది.ఆ ఉద్యమం ఆ ప్రచారం మహబూబ్ నగర్ రైతాంగానికి జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులకు, ప్రజాస్వామిక వాదులకు రాష్ట్ర సాధన జరిగితే జిల్లాకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కల్పించింది.రాష్ట్ర సాధన జరిగింది కాని సాగునీటి కల్పనలో ఆశించదగ్గ మార్పు రాలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి ఎక్కువ సాగుయోగ్యమైన భూములున్న జిల్లా మహబూబ్ నగర్,అత్యంత తక్కువ వర్షపాతమున్న జిల్లా మహబూబ్ నగర్,తెలంగాణ రాష్ట్రంలోనైతే అన్ని విధాలుగా పెద్ద జిల్లా అయినా సాగునీటి లేమివల్ల కేవలం వర్షాధార సేద్యం వల్ల జిల్లా ప్రజాజీవనం అన్ని జీవన రంగాలలో వికాసానికి దూరంగా మిగిలిపోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు ఈకార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నాయకులు బేక్కజనార్ధన్, పరమేశ్వర్ గౌడ్ , హనీఫ్ అహ్మద్, ఖలీల్, మధుసూదన్ బాబు, ప్రభాకర్, సాయిబాబా, సదానంద గౌడ్, రాజేందర్ రెడ్డి, రాఘవాచారి,టిజి శ్రీనివాస్, తిరుమలయ్య, రవీంద్రనాథ్, నర్సింలు,సత్యనారాయణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



బోడుప్పల్, మే 16 (జనంసాక్షి) : బోడుప్పల్ నగర అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న ప్రధాన రహదారుల విస్తరణ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది.బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుండి వరంగల్ ప్రధాన రహదారి వరకు ఉన్న రహదారి అభివృద్ధి పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరై టెండర్ల దశకు చేరుకున్నాయని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ రహదారి సమస్య పరిష్కార దశకు చేరుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బోడుప్పల్--చిలుకానగర్ రోడ్డు, బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచెర్ల వరకు ఉన్న ప్రధాన రహదారి పనులు కూడా త్వరలో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి,కాంగ్రెస్ నేత పక్కీర్ హరినాథ్ రెడ్డి కలిసి మర్యాదపూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపారు. నగర అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబు,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్లయాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు చెప్పారు.ముఖ్యంగా వరంగల్ ప్రధాన రహదారి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఉన్న రహదారి ట్రాఫిక్ సమస్యలు,ప్రమాదాలకు కేంద్రంగా మారిందని,ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు వివరించారు.ఇప్పటికే కొన్ని కీలక పనులు పూర్తయ్యాయని రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంబాల తొలగింపు పనులు కూడా త్వరలో పూర్తి కానున్నాయని తెలిపారు.పనులు పూర్తయిన వెంటనే రహదారి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చి వేలాది మంది ప్రజలకు ఊరట కలిగించనుందని పేర్కొన్నారు.అలాగే బోడుప్పల్ నుండి చిలుకానగర్ వరకు,బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచెర్ల వరకు వెళ్లే ప్రధాన రహదారులు అభివృద్ధి చెందడంతో పరిసర కాలనీల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పాలకవర్గం లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు ముందుండి పని చేస్తానని ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని బీఆర్ఎస్ మహా ధర్నా



వెల్దండ, మే 16 (జనంసాక్షి) : పెట్రోల్, డీజిల్ పై మూడు రూపాయలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై వారం వేయడానికి తక్షణమే ఉపసంహరించుకోవాలని వెల్దండ మండల బారాస పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన జాతీయ రహదారిపై శనివారం బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మండల పార్టీ రాంరెడ్డిలు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 12 సంవత్సరాల కింద రూ. 55 రూపాయలు ఉన్న పెట్రోల్ ధర నేడు రూ.113 వచ్చిందన్నారు. దేశంలో అందరికీ సరిపడా చివరి నిల్వలు ఉన్నాయని నమ్మబలికిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల పూర్తయిన వెంటనే చమురు ధరలు పెంచడం దారుణమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలతో సామాన్యుల పై పెను భారం మోపుతున్నాయన్నారు.అనంతరం కార్యాలయంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, తరుగు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ఈ రాస్తారోకో సందర్భంగా రహదారిపై అరకిలో మీటర్ మేర ట్రాఫిక్ జామై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ఎస్సై యుగంధర్ రెడ్డి రాస్తారోకో దగ్గరకు చేరుకొని పోలీస్ సిబ్బంది సహాయంతో వాహనాలను నియంత్రించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి, మాజీ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు కానుగుల జోగయ్య కన్యాకుమారి, సర్పంచ్ శ్రీనివాసులు, వెల్దండ గ్రామ వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్, గండికోట రాజు, తిరుమలరావు, మాజీ ఉపసర్పంచ్ రాజు నాయక్, పకాడీ. జగదీశ్వర్, డీలర్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు లింగం, జ్యోతి నిరంజన్, హనుమంతు నాయక్ , యువ నాయకుడు పోలే అశోక్, జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, ప్రవీణ్, లాలయ్య, నరసింహ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం చేయాలి



మల్దకల్, మే 16 (జనంసాక్షి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శనివారంమల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలోశాస్త్రవేత్త డా.యం.శంకర్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడాలని,దాని వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా నేల సారాన్ని కాపాడుకోవచ్చని, అవసరం మేరకే రసాయనాలను వాడాలని,సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అదే విధంగా శాస్త్రవేత్త ఏ.శ్రీరామ్ మాట్లాడుతూ పంటమార్పిడి దాని అవసరం, మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాలను పండించడం వలన అధిక దిగుబడితో పాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్ ను కూడా పొందవచ్చని,సరియైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం వలన,నీటిని ఆదా చేసి భావితరాలకు ఇవ్వడం మన బాధ్యత అని తెలియజేశారు.మండల వ్యవసాయ అధికారి కే.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాన పంట సమస్యలను వాటి యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శైలజ, ఏఈఓ సోనియా,రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్




తాండూరు, మే 16 (జనంసాక్షి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. తాండూర్ మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)ను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సందర్శించి ఇటీవల జరిగిన ఘటనపై ఆరా తీశారు. అలాగే ఆసుపత్రి భవన పరిస్థితి, మరుగుదొడ్లు మరియు పారిశుధ్య సౌకర్యాలను పరిశీలించారు.నియమాలు మరియు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం, సిబ్బంది హాజరు రిజిస్టర్ లు,మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అలాగే ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డాక్టర్ లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శరత్ ,ఆర్ ఎం ఓ అనిల్, సునీత,మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి,వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 3.15 కేజీల గంజాయి, స్కూటీ స్వాధీనం



జడ్చర్ల, మే 16 (జనంసాక్షి) : బాలానగర్‌లో శనివారం తెల్లవారుజామున జడ్చర్ల ఎక్సైజ్ అధికారులు జరిపిన మెరుపు దాడిలో గంజాయి విక్రయిస్తున్న బీహార్‌కు చెందిన ఉపేంద్ర కుమార్ ను అరెస్ట్ చేశారు. శనివారం జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎల్. నరసింహారెడ్డి వివరాలను వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలానగర్‌లోని ఓ ఫ్లాట్‌పై ఎక్సైజ్ సిబ్బంది సోదాలు నిర్వహించి, నిందితుడి నుండి 3.15 కేజీల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, హోండా యాక్టివా బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు బీహార్ నుండి కేజీ రూ. 5వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, ఇక్కడ 5 గ్రాముల చొప్పున చిన్న పొట్లాలుగా ప్యాక్ చేసి, ఒక్కో పొట్లాన్ని రూ. 400 చొప్పున బాలానగర్, గుండేడు, మోతిఘనపూర్, మాచారం ప్రాంతాల్లోని కంపెనీల కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ విప్లవ రెడ్డి రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, కార్తీక్ రెడ్డి, సిబ్బంది ప్రకాష్, పాషా, ప్రవీణ్ పాల్గొన్నారని తెలిపారు. గంజాయి సమాచారం తెలిస్తే 9030019943, 8712658861 నెంబర్లకు తెలపాలని, వివరాలు రహస్యంగా ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు.

# ఇద్దరు వృద్ధ మహిళల దారుణ హత్య

మొయినాబాద్, మే 16 (జనం సాక్షి) : తీసుకున్న అప్పు తీర్చలేక వికారాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరి వృద్ధ మహిళలను హత్య చేసి పూడ్చిపెట్టిన సంఘటన మొయినాబాద్ చేవెళ్ల సరిహద్దుల్లో ముడిమాల రిజర్వ్ ఫారెస్ట్ తీవ్ర కలకలం రేపింది మృతుల బంధువులు తాండూర్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల్ కాశీపూర్ గ్రామంలో అంగన్వాడి న్యాయంగా పనిచేస్తున్న అబేదా బేగం ఆమెకు పరిచయమున్న మహిళ కరీమా బేగం సుమారు మూడు సంవత్సరాల క్రితం కు 2 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చింది అందులోనుండి 50,000 రూపాయలు తిరిగి అబిదా బేగం కు ఇచ్చింది మిగతా 1,50,000 రూపాయలు ఇవ్వవలసిందిగా అబిదా బేగం మహిళ కరీమా బేగం అడిగింది దాంతో డబ్బులు తిరిగి ఇవ్వలేక ఆమెతో అక్రమ సంబంధం లో ఉన్న రహమత్ తో విషయం తెలిపింది దాంతో రహమత్ కరీమా బేగం గతంలో మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట రెవెన్యూలో ఫామ్ హౌస్ లో పనిచేసే వెళ్లిపోయారు వారు మొయినాబాద్ మండల్ లో పనిచేసినప్పుడు పరిచయమైన తోల్కట్ట గ్రామానికి చెందిన నయీమ్ వ్యక్తి దగ్గరకు వచ్చి కరీమా బేగం నేను డబ్బులు ఇవ్వలేను నేను చనిపోతానని నయీమ్ రహమత్తో తెలిపింది అందుకు వారు డబ్బులు కోసం నువ్వు ఎందుకు చనిపోతావు



డబ్బులు ఇస్తామని అబేద బేగం ను తోలు కట్టకు రప్పించి ఆమెని హత్య చేద్దామని పథకం అన్నారు ఏప్రిల్ 5వ తేదీన తోల్కట్ట రెవెన్యూ లో గల నయీమ్ పనిచేసే ఫామ్ హౌస్ కు పిలిపించి పథకం ప్రకారం హత్య చేసి ముడిమాల రిజర్వ్ ఫారెస్ట్ లో పాతిపెట్టారు అబిదా బేగం కనిపించడం లేదని ఏప్రిల్ 4 తేదీన బషీరాబాద్ మండల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. దాంతో బషీరాబాద్ పోలీసులు విచారణ చేపట్టి అభేదా బేగం ఎవరితో మాట్లాడింది వారు ఎవరితో మాట్లాడారు అని ఫోన్ కాల్ డాటా ఆధారంగా విచారణ చేపట్టారు దాంతో పోలీసులకు విసుపోయే విషయాలు వెలుగు చూశాయి మా బేగం ఆధారంగా లొకేషన్ పరిశీలించగా తోల్కట్ట ముడుమాల్ రిజర్వ్ ఫారెస్ట్ లో కేషన్ గుర్తించారు దాంతో సదరు వ్యక్తులను పట్టుకొని విచారించగా తీసుకున్న డబ్బులు అడుగుతున్నందుకే మేము ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాము కాబట్టి ఆమెను హత్య చేశామని సదరు మహిళ ఆమెతో అక్రమ సంబంధం లో ఉన్న రహమత్ నయీమ్ అంగీకరించారు వారిని గట్టిగా పోలీసులు విచారించగా తీగ లాగితే డొంక కదిలినట్టు మరో హత్య కేసు కూడా బయటపడింది వికారాబాద్ జిల్లా తాండూర్ మండల్ కోకట్ ఇందిరమ్మ కాలనీకి చెందిన మైబుబి (65) గత మహబూబీ దగ్గర గతంలో కరీమా బేగం తీసుకున్న 40,000 తీసుకుంది ఆమెకు డబ్బులు తిరిగి ఇవ్వలేక సుమారు 45 రోజుల క్రితం మహబూబ్బిని 40 వేల రూపాయలు ఇస్తాము మండల పరిధిలోని తొలుకట్ట ఫామ్ హౌస్ కు రప్పించి ఆమెను కూడా హత్య చేసి పూడ్చిపెట్టామని తెలిపారు దాంతో తాండూర్ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆదేశాలతో తాండూర్ సీఐ మొయినాబాద్ పోలీసులు ఎస్సై వెంకన్న పోలీస్ సిబ్బంది మొయినాబాద్ తాసిల్దార్ గౌతం కుమార్ సమక్షంలో పూడ్చిపెట్టిన సమాధులను తీసి రిజర్వ్ ఫారెస్ట్ లోనే శివ పంచామలు నిర్వహించి మృతుల అస్థికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పార్టీలకు అతీతంగా బీరంగూడను అభివృద్ధి చేసుకుందాం



సంగారెడ్డి, మే 16 (జనం సాక్షి) : పార్టీలకు అతీతంగా బీరంగూడ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని అదేల్లి రవీందర్ అన్నారు. శనివారం మహిళ కమిషన్ సభ్యురాలి గా నియమితులైన బీరంగూడ గ్రామ వాసి శశికలా యాదవరెడ్డి ని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అదేల్లి రవీందర్ ఆధ్వర్యంలో శాలువా పూల మాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా బీరంగూడ గ్రామ అభివృద్ధి విషయంపై వారు చర్చించారు. పార్టీలకు అతీతంగా బీరంగూడ అభివృద్ధికీ కలిసి కట్టుగా కృషిచద్దామని తెలిపారు. ఈసందర్భంగా శశికలా బీరంగూడ అభివృద్ధికీ సంపూర్ణ సహకారం అందజేస్తామసని తెలిపారు. ఈకార్యక్రమంలో బీరంగూడ అధ్యక్షులు మాజీ కన్సిలర్ అనురుద్ రెడ్డి , యాదవ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి చిన్నా వీరేష్ , ఉపాధక్షులు సత్యనారాయణ, నక్కల కిష్టయ్య, కోశాధికారి బంటు శివ , కార్యదర్శి బంటు రమేష్ , సభ్యులు ఎడ్ల అశోక్, బంటు ప్రవీణ్, శంకర్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 మే 2026

# అభివృద్ధి నిర్మాణ పనులలో వేగం పెంచాలి

- జూన్ 2న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశం



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 16 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగంగా చేయించి జూన్ 2 ( రాష్ట్ర అవతరణ దినం) వ రోజున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల లో వివిధ నిధులతో కొనసాగుతున్న పలు నిర్మాణ పనుల పై శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎస్. ఈ లు, ఈ ఈ లు, డీ ఈ లు, ఏ ఈ లతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు.ముందుగా జిల్లా కేంద్రానికి సంబంధించి మెడికల్ కళాశాల, ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే మెడికల్ కళాశాల వద్ద ఒక్క బోరు కూడా పడలేదని, మరి నిర్మాణ పనులకు క్యూరింగ్ ఎలా చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు.మెడికల్ కళాశాల సమీపంలో ఒక రైతు పొలానికి చెందిన ప్రైవేటు బోరు నుంచి నీటిని క్యూరింగ్ కు వాడుకుంటున్నామని అధికారులు కలెక్టర్ కు జవాబు ఇచ్చారు.ప్రభుత్వ భవన నిర్మాణాలు ఎక్కడ జరిగినా ముఖ్యంగా మెడికల్ కాలేజీ వద్ద తప్పకుండా వాన నీటి సంరక్షణ ( ఇంకుడు గుంతలు) చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో జనరేటర్ ఎంతో అవసరమని కానీ ఎందుకు వినియోగంలో లేదని ప్రశ్నించారు.జనరేటర్ ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో ఏ ఏ మండలాల్లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో మర మ్మతు పనులు జరుగుతున్నాయని ఆరా తీశారు.వాటితో పాటు పీఎం శ్రీ స్కూల్స్ లలో సైన్స్ ల్యాబ్స్ నిర్మాణాలను పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. 2023-24, 2024-25 సంవత్సరం నాటి పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. మక్తల్ లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అకాడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా, పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. మక్తల్‌లో జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణం, అలాగే మద్దూరు ఎస్సీ బాలుర వసతి గృహ మరమ్మతు పనుల గురించి కలెక్టర్ ప్రస్తావించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఏమైనా మరమ్మతు పనులు ఉంటే వేసవి సెలవులు ముగిసే లోపు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు.జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం పక్కన సమీకృత చేనేత భవన నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా జూన్ 2న ప్రారంభానికి సిద్ధంగా ఉందా అని అడిగి, అంతలోపు మిగతా పనులేమైనా ఉంటే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు.ఇక జిల్లా కేంద్రంలోని మూడు ఓవర్ హెడ్ 10 లక్షల లీటర్ల ట్యాంకుల నిర్మాణాలు ఆగస్టు వరకు పూర్తి చేయాలని ఆమె సూచించారు.మక్తల్ పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తో పాటు సంగం బండ రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా కు ప్రత్యామ్నయ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈ ఈ లు శ్రీనివాస్ రావ్, రంగారావు తెలిపారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.మన్యం కొండ నుంచి జిల్లాకు మిషన్ భగీరథ పథకం ద్వారా రోజుకు ఎన్ని లీటర్ల నీటి సరఫరా జరుగుతుందో తనకు జాబితా ఇవ్వాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా మండలాల వారీగా ఏ ఏ పనులు జరుగుతున్నాయో ఏ ఈ లను అడిగి తెలుసుకున్నారు.నిర్ణీత సమయంలో ఆయా పనులను పూర్తి చేయాలన్నారు.వేసవి కాలం తర్వాత పనులు చేస్తే లాభం లేదన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బీ పరిధిలో జరుగుతున్న రోడ్ల పనులు, కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనుల గురించి ఆ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని కూడా జూన్ 2 లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని తేల్చి చెప్పారు.గుండుమాల్,కొత్తపల్లి మండలాల సమీకృత భవన సముదాయాల నిర్మాణ పనులు, కాడ నిధులతో చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఇది తనకు తొలి సమావేశం అని, వచ్చే సమావేశానికి ఏ ఈ లు ఎన్ని పనులు పూర్తి చేశారో? ఎన్ని పర్యటనలు చేశారో నివేదికలతో రావాలని, ఇతర జిల్లాలకు ఇన్ ఛార్జ్ గా ఉన్నామని కారణాలు చెప్పవద్దని,ఈ జిల్లాలో ఖచ్చితంగా గురు,శుక్ర, శని వారాల్లో అందుబాటు లో ఉండాలని ఆదేశించారు.అభివృద్ధి నిర్మాణ పనులు,శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలలో విధిగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో టీజీ ఎం ఐ డీ సి ఈ ఈ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, ఆర్ అండ్ బీ ఎస్. ఈ. వెంకట రమణ, ఆయా శాఖల డీ ఈ లు, ఏ ఈ లు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా తయారు చేయాలి



**గద్వాల నడిగడ్డ, మే 16 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఫైనల్ ఓటర్ జాబితాను తయారు చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై శనివారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 76.54 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. గద్వాల పురపాలికలో 52.99 శాతం మాత్రమే కావడంతో మెరుగైన పనితీరు కనబరచాలని ఆదేశించారు. గద్వాల మున్సిపాలిటీలో వార్డుల వారీగా సూపర్వైజర్లు, బిఎల్వోలు, వార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించేందుకు ఈనెల 19న రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటర్ జాబితా అక్టోబర్ 1న ప్రచురించాల్సి ఉన్నందున జూన్ 15 నుంచి 24వ తేదీ వరకు పూర్తికాని మ్యాపింగ్ ప్రిపరేషన్ చేపట్టాలన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాను సమగ్రంగా రూపొందించేందుకు అవసరమైన ఓటర్ల డాక్యుమెంట్స్ సేకరించాల్సి ఉంటుందన్నారు. జూలై 24 లోగా పోలింగ్ స్టేషన్ల రేష్నలైజేషన్, జూలై 31 న ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్ ప్రచురించాల్సి ఉంటుందన్నారు. డ్రాఫ్ట్ సంబంధించి జూలై 31 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. సెప్టెంబర్ 28 లోగా క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ను డిస్పోజల్ చేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ పబ్లికేషన్ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్లో, ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సి సెక్షన్ పర్యవేక్షకులు మంజుల, గద్వాల్ తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశిలా క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం



**మల్దకల్, మే 16 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని క్యూ పద్ధతిలో దర్శించుకున్నారు.ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయం సిబ్బంది,అర్చకులు భక్తులకు అందుబాటులో ఉండి అర్చనలు పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు స్థానిక అన్నదాన సత్రంలో గద్వాల టెక్నో స్కూల్ వారు అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. సాయంత్రం శ్రీ స్వామివారి రథోత్సవం అనంతరం పల్లకి సేవ రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి. రాత్రి శాంతినగర్ శివ శివాని టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రముఖ హరికథ భాగవతార్ హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో హరికథను భక్తులకు వినిపించగా హార్మోనియం సహకారం ఆంజనేయులు,తబల సహకారం బండలయ్య అందించారు.అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రం బహుకరించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో సీతారాంరెడ్డి, చంద్రశేఖరరావు, ఆరగిద్ద రాముడు,వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి కాలువ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే పల్లా

- భూసేకరణ పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**చేర్యాల, మే 16 (జనంసాక్షి) :** రాష్ట్ర సచివాలయంలో శనివారం నిర్వహించిన దేవాదుల ప్రాజెక్టు పురోగతి సమీక్షా సమావేశంలో జనగామ నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, రైతులకు నీటి సరఫరా పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నియోజ కవర్గానికి సంబంధించిన సాగునీటి అవసరాలు, భూసేకరణ సమస్యలు, కాలువల నిర్మాణంలో జాప్యం, చివరి ఆయకట్టుకు నీటి అందుబాటువంటి



అంశాలపై సమగ్ర వినతిపత్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అసంపూర్తి కాలువ పనులు పూర్తి చేయాలి

దేవాదుల ప్రాజెక్టు ఫేజ్-3 పరిధిలోని ప్యాకేజీ-8 కింద ఉన్న తపాస్‌పల్లి, కన్నెబోయినగూడెం రిజర్వాయర్ల పరిధిలో కాలువల నిర్మాణ పనులు చాలా కాలంగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే ప్రస్తావించారు. పనులు ఆగిపోవడంతో వందలాది ఎకరాలు సాగునీరు లేక రైతులు ఇబ్బంది లు పడుతున్నారని తెలిపారు. పనులను తక్షణమే పునఃప్రారంభించి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను కోరారు.

### భూసేకరణ పరిహారం వెంటనే విడుదల చేయాలి

కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో భూసేకరణ పరిహారం అందలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పెండింగ్ పరిహారం మొత్తాన్ని వెంటనే విడు దల చేసి బాధిత రైతులకు చెల్లించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారం సాధిస్తామని స్పష్టం చేశారు. జనగామ రైతుల హక్కుల కోసం ఎప్పటికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

## లారీలు రాకపోవడంతో రైతులు ఆందోళన



**చిన్నశంకరంపేట, మే 16 (జనం సాక్షి) :** చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామ శివారులో గల మెదక్- చేగుంట రహదారిపై శనివారం మధ్యాహ్నం మహిళా రైతులు ఆందోళనకు దిగారు.వరి కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించిన ధాన్యాన్ని 20 రోజుల నుండి తూకం వేసిన బస్తాలు అట్లాగే ఉండడంతో మండుటెండలో అక్కడే ఉండవలసిన పరిస్థితి దాపరించి ఉందంటూ మహిళ రైతులు అధికారులను నిలదీశారు. రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. సమాచార అందుకున్న స్థానిక ఎస్సై శివానందం తన సిబ్బందితో రాస్తారోకో చేస్తున్న సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సందాయించారు. దీంతో డిప్యూటీ తాసిల్దార్ మహేందర్ గౌడ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయి ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**జడ్చర్ల, మే 16 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఇంకా ప్రారంభం కాని ఇండ్లను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిపై ఆయన అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే ప్రారంభించిన ఇండ్లకు సంబంధించి రాబోయే సోమవారం లోగా మార్కౌట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఇండ్లు నిర్మించుకోవడానికి ఎవరైనా లబ్ధిదారులు ఆసక్తి కనపరచకపోతే, వారి ఇండ్లను రద్దు చేసి, ఆ స్థానంలో కొత్త ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులకు సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయ ప్రాజెక్ట్ నిర్వాహకులు, ఐకేపీ క్లస్టర్ కోఆర్డినేటర్లు, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్లు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, జడ్చర్ల మున్సిపల్ వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన అన్‌లోడింగ్ చేయాలి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 16 (జనం సాక్షి) :** ధాన్యాన్ని త్వరితగతిన అన్లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిల్లర్లను ఆదేశించారు. ఘన్పూర్ మండలంలోని పలు రైస్ మిల్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియ స్పీడ్ అప్ చేయాలని, హమాలీల కొరత లేకుండా చూడాలని, అధికారుల ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా తక్షణమే ధాన్యం దిగుమతి చేపట్టి, తూకం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అకాల వర్షాల సంభవిస్తే రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లు, నిల్వ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యం జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణలో పోక్సో చట్టం కీలకం

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 16 (జనం సాక్షి) :** బాలల పరిరక్షణలో పోక్సో చట్టం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు.పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేం దుకు అమలులో ఉన్న పోక్సో చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిల్లల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం ఈ చట్టం ఎంతో కీలకమని పేర్కొన్నా రు.పిల్లలపై లైంగిక దాడులు, వేధింపులు, దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు విధించబడ తాయని తెలిపారు. ఈ చట్టం ప్రకారం18 సంవ త్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరినీ "పిల్లలు"గా పరిగ ణిస్తారని, వారిపై జరిగే ఏ విధమైన లైంగిక నేరమైనా తీవ్రంగాపరిగణించబడుతుందని స్పష్టం చేశారు. పిల్లలపై జరిగే నేరాలను దాచిపెట్టడం లేదా రాజీ ప్రయత్నాలు చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కేసుల్లో తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు అత్యంత సున్నితంగా, వేగంగా స్పందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, మంచి-చెడు స్పర్శల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.పిల్లలు ఇంటి దగ్గర ఉన్న, పక్క ఇంట్లో వదిలి వెళ్లిన, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీలు మరియు ఇతర విద్యాసం స్థలు తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ గారు తెలిపారు.సమాజంలో ఎక్క డైనా పిల్లలపై అనుమానా స్పద ఘటనలు గమనించి నట్లయితే వెంటనే పోలీ సులకు డయల్ 100 కు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచు తామని భరోసా ఇచ్చారు. పోక్సో చట్టం అమలులో పోలీస్ శాఖ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పిల్లల రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత మనందరి బాధ్యత అనే సందేశంతో సమాజం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు.

# రామరాజ్యం అంటూ దోపిడీ పాలన..?

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, మే 16 (జనం సాక్షి) :** గద్వాల జిల్లా కేంద్రం: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజలపై కేంద్రంలోని మోడీ బీజేపీ ప్రభుత్వం పెను భారం మోపిందని, కేంద్ర సర్కార్ వైఫల్యంతోనే దేశంలో అధిక ధరల పెరుగుదల అని రామరాజ్యంలో నేడు అందుకు విరుద్ధమైన దోపిడి పాలన సాగుతున్నరని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు విమర్శించారు. శనివారం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గించాలని డిమాండ్ చేస్తూ గద్వాల జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ గా వెళ్ళి వై ఎస్ ఆర్ సర్కిల్ లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.రోజురోజుకు ధరలను పెంచి దేశ పేద ప్రజలపై అధిక భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వలన నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా చార్జీలు కూడా పెరుగుతాయని, దీంతో పేద ప్రజలు ఇబ్బందుల పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్ల ధరలను రూ. 993 పెంచడంతో రూ.3100కు చేరుకున్నదని, గృహ అవసరాల గ్యాస్ సిలెండర్ పై రూ.50 పెంచడం, అలాగే పెట్రోల్, డీజిల్ మీద లీటరు రూ. 3, పెంచడం జరిగిందని, దీంతో ప్రజల మీద మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్ ధరల వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై ఆర్థిక భారాలు పడతాయని అన్నారు. అమెరికా- ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నట్లని దుయ్యబట్టారు. వాహనదారులను, పేద ప్రజలను కేంద్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తుందని విమర్శించారు. పేద ప్రజలపై అధిక భారం మోపి దోచుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఖాసిం నాయకత్వం




వహించారు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్కూర్ రంగన్న, ఆశన్న,జిల్లా సమితి సభ్యులు రవి తదితరులు మాట్లాడారు,మండల సహాయ కార్యదర్శి నారాయణ, వెంకటేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భరత్,ప్రవీణ్. ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శాంతన్న, సిపిఐ ఎఐటియుసి నాయకులు ప్రభూదాస్, మస్తాన్, రాజు, ధర్మాన్న,వెంకటరాములు, చెనిగొని పల్లి సిపిఐ కార్యదర్శి వెంకటేశ్, తిమ్మప్ప, గోకారి,శేఖర్, తదితరులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 18న ప్రకృతి విపత్తులపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, ప్రతినిధి మే 16 (జనంసాక్షి) : రెవెన్యూ, పోలీస్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, మున్సిపల్, తదితర శాఖల సమన్వయంతో ఈనెల 18న నిర్వహించనున్న ప్రకృతి విపత్తులపై మాక్ ఎక్సర్సైజ్‌ను విజయవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వివిధ శాఖలు సమన్వయంతో తక్షణ రక్షణ, సహాయక చర్యలు ఎలా చేపడతాయో ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ నగర పరిధిలోని టీఎన్‌జీఓస్ కాలనీ ఫేజ్-2, వివేక్‌నగర్, సమ్మయ్యనగర్, ప్రగతినగర్, గోపాలపూర్, టీవీ టవర్ కాలనీ, యూపీహెచ్‌సీ లస్కర్‌సింగారం ప్రాంతాల్లో ఈ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మాక్ డ్రిల్ నిర్వహణకు సంబంధించి ట్రాన్స్‌పోర్టేషన్, కమ్యూనికేషన్స్, అగ్నిమాపక సేవలు, సమాచారం మరియు ప్రణాళిక, అత్యవసర సహాయం మరియు ఆశ్రయ కేంద్రాలు, వైద్య సేవలు, వ్యవసాయం, పశుసంవర్ధక సంక్షేమం, విద్యుత్, ఇంధన సరఫరా తదితర విభాగాలకు సంబంధించిన అవసరమైన బృందాలు, పరికరాలు, వనరులు, లాజిస్టిక్ సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎండి. ఆయూబ్ అలీ, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి రవి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ నాగరాజు, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- విద్యార్థులను వేధించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి
- గిరిజన శాఖ డీడీ దేశిరామ్ నాయక్‌కు గిరిజన సంఘం వినతిపత్రం



మహబూబాబాద్ ప్రతినిధి, మే 16 (జనంసాక్షి): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు కిషన్ నాయక్ మాట్లాడుతూ, గతంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజుల విషయంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడంతో పాటు, ఫీజుల పేరుతో ఎలాంటి వేధింపులు చేయకుండా విద్యాసంస్థలను నియంత్రించాలని ఆయన అన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి ఎంపికైన విద్యార్థులను ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురిచేయకూడదని డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన శాఖ డీడీ దేశిరామ్ నాయక్‌కు గిరిజన సంఘం ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీరామ్ నాయక్, యుగేందర్ నాయక్, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య



ములుగు ప్రతినిధి, మే 16(జనంసాక్షి) : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ములుగు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాకు 1వ తరగతికి 20 సీట్లు, 5వ తరగతికి 22 సీట్లు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు 15.05.2026 నుండి 06.06.2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన పాఠశాలలు**

ఆదర్శ హై స్కూల్, కమలాపురం - (ఇంగ్లీష్ మీడియం, డే స్కాలర్), సాధన హై స్కూల్, ములుగు - (డే స్కాలర్), శ్రీ అరవింద విద్యా మందిర్ హై స్కూల్, ములుగు - (డే స్కాలర్), సన్ రైసర్స్ హై స్కూల్, ములుగు - (డే స్కాలర్ / రెసిడెన్షియల్), ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థి మాత్రమే ఈ పథకానికి అర్హుడు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ. 1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాలకు రూ. 2,00,000/- లోపు ఉండాలి. జనన ధృవీకరణ పత్రం (1వ తరగతి విద్యార్థులకు మాత్రమే) 1వ తరగతికి విద్యార్థులు 01.06.2020 నుండి 30.06.2021 మధ్య జన్మించి ఉండాలి. 5వ తరగతికి దరఖాస్తు చేసే విద్యార్థులు 4వ తరగతి స్టడీ సర్టిఫికేట్ జతచేయాలి. రేషన్ కార్డు / ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ. మీ-సేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు. మూడు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు. గత విద్యా సంవత్సరపు మార్కుల మెమో జిరాక్స్ కాపీ. ఆసక్తి గల విద్యార్థులు ములుగు జిల్లా సంక్షేమ భవనంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం నుండి దరఖాస్తు ఫారములు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 06.06.2026 సాయంత్రం 4.00 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# దేవాదుల పిల్ల కాలువలు పునరుద్ధరించండి



ఎల్కతుర్తి (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని 20 గ్రామాల్లో గొలుసుకట్టు కాలువలు, పిల్ల కాలువల పునరుద్ధరణ మరియు ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ మండల బీజేపీ అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామాల పరిధిలో ఉన్న గొలుసుకట్టు కాలువల వ్యవస్థ ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. గతంలో చెరువుల నుంచి వచ్చే అధిక నీరు ఈ కాలువల ద్వారా క్రమబద్ధంగా వెళ్లేది. కానీ ప్రస్తుతం ఆక్రమణలు, పూడిక నిండడం వల్ల వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బావుల దగ్గర ఉన్న కెనాల్ కాలువలు, చిన్న పిల్ల కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోయాయి. వీటికి తక్షణ మరమ్మతులు చేపట్టి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, వర్షాకాలం మొదలవ్వకముందే మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఎల్కతుర్తి మండల ప్రజల తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, ఆడెపు శ్రీవర్ధన్, కొడం రమేష్, మాటూరు విద్యాసాగర్, చీరాల రంజిత్, సుఖిన సుధాకర్, సూదిరెడ్డి సాయిరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

# రక్తమోడుతున్న ఎన్‌హెచ్ 353సి రహదారి

- ప్రయాణికుల జీవితాలు గాల్లో కలుస్తున్న వైనం
- ప్రమాదాలకు కారణాలు పసిగట్టని ప్రభుత్వం
- నిండు కుటుంబాలు రోడ్డున పడుతున్న తీరు
- కటిక దరిద్రంతో కాలం వెళ్లదీస్తున్నారు





కాటారం, మే 16 (జనం సాక్షి) : తెలంగాణలో జాతీయ రహదారులు రక్త ప్రవహిస్తుంది ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి నిండు కుటుంబాలు వెలితితో కాలం వెలదీస్తున్నారు. కుటుంబాలు అనాథలుగా మారి పిల్లలు అనాథలవుతున్నారు. ప్రయాణం తప్పని పరిస్థితి ఎందుకో కానీ వరంగల్ నుంచి కాళేశ్వరం వరకు మహారాష్ట్ర గడిచిరోడ్ జిల్లా నుండి జాతీయ రహదారి వెంట అనేక మంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ ప్రాంతంలో కాళేశ్వరం, అన్నారం, పలుగుల, సోమనపల్లి ప్రాంతంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేశారు. మలహర్ మండల్ తాడిచెర్లలో బొగ్గు నిక్షేపాలు ఉండవలన నిత్యం బొగ్గు రవాణా జరుగుతా ఉంది. భూపాలపల్లి జిల్లా చిల్పూర్ లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉండడం వలన బొగ్గు లారీలు నిత్యం తిరుగుతా ఉన్నాయి. తెలంగాణలో గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో ఇసుక రవాణా జరుగుతూ నిత్యం లారీలు ఈ రహదారి వెంటనే వరంగల్ వైపు హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. అధిక రద్దీ కారణంగా ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ ప్రాంత ప్రజలు వింటూనే ఉన్నారు. తెలంగాణ లో కాళేశ్వరం మంథని ప్రాంతాల్లో అధిక లారీలు ప్రయాణాలు జరుగుతుంటాయి. ఇసుక బొగ్గు ,సిమెంటు, లారీలు ఈ ప్రమాదాల కారణమని చెప్తున్నారు. అధికలోడు రాత్రుల్లో నియంత్రణ లేకపోవడం మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం డ్రైవింగ్ చేస్తూ నిద్ర పోవడం, అధికలోడును నియంత్రణ చేయకపోవడం అద్భుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. కాళేశ్వరం, అన్నారం బ్యారేజీ నుండి ఇసుక అధిక మొత్తంలో రవాణా జరుగుతుంది. నెల క్రితం కాటారం మండలం గంగారానికి చెందిన వెన్నపురెడ్డి అన్వేష్ 23, బొమ్మపూర్ చెందిన మరో ఇంజనీరింగ్ విద్యార్థి రేగొండ దగ్గర కారు ఢీకొనడం వలన ఇద్దరు స్పాట్లోనే మరణించారు. ఒకే కుమారుడు కుటుంబ పెద్దదిక్కు పోవడం వలన గంగారానికి చెందిన ఆ కుటుంబం ఇప్పటివరకు కోల్పోలేదు. చిన్న వయసులోనే ఇలాంటి ప్రమాదాలతో గాల్లో కలుస్తున్నాయి. గత సంవత్సరం కాటారం మండల కేంద్రంలో ఇసుక లారీ ఢీకొని తోట రవి, తన రెండు కాళ్లు కోల్పోయాడు. అతని పరిస్థితి మంచానికి పరిమితమైనది. నిరుపేద కుటుంబం చూస్తూ కాలం వెలదీస్తున్నారు. అతను పని చేసుకోలేక కుటుంబానికి భారమయ్యాడు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడం ఆ కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైంది.

ధన్వాడ గ్రామానికి చెందిన తులసి గారి రాజలింగు, కాటారం మండల కేంద్రంలోని ఇసుక లారీ ఢీకొని మృతిచెందాడు. జాతీయ రహదారి 353 సి కాళేశ్వరం నుండి భూపాల్ పల్లి వరకు రోడ్డు రహదారి రైలు పట్టాలుగా మాదిరిగా మారినది. రహదారిపై ప్రయాణిస్తా ఉంటే వాహనాలు ఆ గాడిలకు తగిలి అద్భుతప్పి ఇతరులపై దూసుకు వెళ్తున్నవి. ద్విచక్ర వాహనదారులు వారికి వారే అదుపుతప్పి కిందపడి ప్రాణాలు కోల్పోతున్నారు. కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కమలాపూర్ క్రాస్ వద్ద కాటారం మేడిపల్లి ప్రధాన రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఆటో ఢీకొన్న ఘటన భూపాలపల్లి జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. మిగతా ముగ్గురు పరిస్థితి ప్రమాదకరంగా పరిస్థితి గత వారం క్రితం మలహరి మండలం ఏం మరి కంపెనీకి చెందిన బొగ్గు లారీ మంథని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో మొదటి భాగం నుజ్జునుజాయి డ్రైవర్ మృతి చెందాడు కాటారం మండలం నస్తువెల్లి వద్ద మే 15 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి వరంగల్ తరలించారు. భూపాలపల్లి జిల్లా కాటారం, కాళేశ్వరం, మహాదేవపూర్ ప్రాంతాల్లో ఏదో ఒక రోజు నెలకి పది చొప్పున రహదారుల వెంట ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. తీవ్రంగా గాయపడి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో బొగ్గు లారీలను ఇసుక లారీలను అధికలోడు నియంత్రించి క్రమ పద్ధతిగా ప్రయాణించేట్లు చూడాలని రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# హనుమకొండ నగరంలో వరద ముప్పు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు

- అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ ప్రతినిధి, మే 16 (జనం సాక్షి) : పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ ఈ సి ప్రధాన రహదారి వెంట నిర్మించనున్న కల్వర్ట్, సైడ్ డ్రైనేజీ పనులు, రాజాజీనగర్ నాలా బ్రిడ్జి పూడికతీత పనులను ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం లేకుండా అశోక్ జంక్షన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు రోడ్డు పరిస్థితులను క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వర్షాకాలంలో వరద ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తక్షణమే పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నాలాల పూడికతీత పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైనేజీ నిర్మాణం, జంక్షన్ల సుందరీకరణ పనుల కోసం సుమారు రూ. 24 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అతి త్వరలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, డీఈ సారంగపాణి, డీఈ గోపి, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎమ్ హెచ్ ఓ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కాసిపేట 1ఏ టన్నల్‌లో మంచి నీటి కూలర్ ఏర్పాటు

కాసిపేట మే 16 (జనం సాక్షి) : కాసిపేట 1ఏ టనల్ లో జనరల్ మేనేజర్ రాధ క్రిష్ణ గారి ఆదేశాల మేరకు కార్మికులకు చల్లని మంచినీటిని అందించాలని కొత్త వాటర్ కూలర్ ను ఏర్పాట్లు చేసిన మేనేజర్ సతీష్ ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడం,కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యం తో మంచి నీటి కూలర్ ను ప్రారంభించడం జరిగిందని మేనేజర్ అన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస అవసరాలైన మంచినీటిని అందించేందుకు కృషి చేయడం జరిగింది దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్,బన్న లక్ష్మన్ దాస్,పార్వతి సురేష్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల ప్రతినిధి, మే16 (జనంసాక్షి) : పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో పారిశుధ్యం, రోడ్డు విస్తరణ పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రజలకు త్రాగునీరు, పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని, వ్యాధుల నియంత్రణలో పరిశుభ్రత కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం హరహదారి విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని, అభివృద్ధి పనుల అనంతరం రహదారి ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ప్రజలతో మాట్లాడి వార్డులో నెలకొన్న సమస్యల వివరాలు తెలుసుకొని అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 6వ వార్డులో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాన్ని లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సంబంధించి రైతుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు వేగంగా తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బొలెరో, ద్విచక్ర వాహనాలు ఢీ



లక్ష్మణ చందా, మే 16 (జనం సాక్షి) : లక్ష్మణ చందా మండలంలోని బోరిగాం జాతీయ రహదారిపై బులెరా, ద్విచక్ర వాహనాలు రెండు బలంగా ఢీకొట్టాయి. అంబులెన్స్ పైలెట్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన షేక్ అదిల్ తండ్రి ఫరీద్ వయసు 18 సంవత్సరాలు బోరిగాం దగ్గర బైకు బొలెరో వాహనాలు ఢీ కొన్నాయి. షేక్ ఆదిల్ కి తలకి తీవ్రమైన గాయమైంది. అతని తో పాటు షేక్ అజ్మత్ కి కూడా చేతికి కాలికి గాయాలయ్యాయి వీరిని మామడ అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి గవర్నమెంట్ నిర్మల్ హాస్పిటల్లో అడ్మిట్ చేయడం జరిగిందని ఈఎంటి సురేష్ అంబులెన్స్ పైలట్ తెలిపారు.

# డెంగ్యూ రహిత సమాజం నిర్మించాలి

- డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ ప్రతినిధి, మే 16 (జనం సాక్షి) : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్, వరంగల్ పరిధిలో ర్యాలీ ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ సంవత్సర నినాదం " సమాజంలో అందరూ ఐక్యంగా నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నిర్మూలించడంలి " తో డెంగ్యూ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనశాలను తిలకించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణ కోసం ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యాధి చికిత్స కంటే వ్యాధి నివారణ ముఖ్యమని తెలిపారు. రానున్న వర్షాకాలము ను దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుండి వ్యాధి ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి రక్త పరీక్షలు చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం డెంగ్యూ వ్యాధి అదుపులోనే ఉందని, ప్రజలు కూడా తమ సామాజిక బాధ్యతలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండాలని కోరారు. తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి వైద్య చికిత్స పొందాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి కే రజిని మాట్లాడుతూ ప్రతి మంగళ శుక్రవారాలలో డ్రైడే పాటించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వల్ ఆపరేషన్లు చేపట్టాలని వైద్య సిబ్బందిని కోరారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇఫ్తికార్ అహమ్మద్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణ్, డాక్టర్ విజయకుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ బి.దిలీప్, డాక్టర్ వేద కిరణ్, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ దిలీప్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, హెచ్ఈఓ లు సదానందం, విజయేంద్ర కుమార్, మనోజ, మున్సిపల్ సూపర్వైజర్ మధుకర్, వైద్య సిబ్బంది కుమారస్వామి, చక్రపాణి, కోర్నేల్ స్థానిక వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 మే 2026

# ఖమ్మం విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావాలి



**ఖమ్మం, మే 16 (జనం సాక్షి) :** ఖమ్మం విజయ డెయిరీకి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని, రాష్ట్రంలోనే ఆదర్శ డెయిరీగా నిలిచేలా సమగ్ర అభివృద్ధి చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రోటరీ నగర్‌లో ఉన్న విజయ డెయిరీ భవనానికి తక్షణ మరమ్మతులు చేపట్టి, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మంత్రి పాడి పరిశ్రమ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఖమ్మం జిల్లాలో పాల ఉత్పత్తి, సేకరణ, రైతులకు లభించే మద్దతు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

### ఉమ్మడి రాష్ట్రంలో విజయ డెయిరీ వైభవం...

ఉమ్మడి రాష్ట్ర కాలంలో విజయ డెయిరీ రోజుకు పదివేల లీటర్ల పాల సేకరణతో కళకళలాడేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. రైతులకు నమ్మకమైన సంస్థగా నిలిచిన విజయ డెయిరీ మళ్లీ అదే స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమకు అపార అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతుల్లో విశ్వాసం పెంపొందించేలా పారదర్శక విధానాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఖమ్మం డెయిరీ ఆధునీకరణపై మంత్రి దృష్టి

ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సమర్థులైన అధికారులు రైతుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, పాల రవాణా మార్గాలను శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా పాడి పరిశ్రమకు కొత్త ఊపిరి పోయాలని అభిప్రాయపడ్డారు.

### మహిళా సాధికారతతో పాడి పరిశ్రమకు బలం

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పాల సేకరణను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సూచించారు. పాడి రైతులకు అవసరమైన బ్యాంకు రుణాలు అందేలా అధికారులు సమన్వయం చేయాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముల్కనూర్ డెయిరీ అభివృద్ధి నమూనాను వివరించగా మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముల్కనూర్ నమూనాను మించి ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పాల ఉత్పత్తి పెంపునకు కార్యాచరణ

జిల్లాలో పశువుల సంఖ్యను పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. పాల ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### రైతుల విశ్వాసమే విజయ డెయిరీ బలం

మంత్రి ఆలోచనలకు అనుగుణంగా విజయ డెయిరీ ఇప్పటికే అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసిందని చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో నాణ్యమైన పాల సేకరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, అత్యంత పారదర్శకంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సహకార శాఖ రిజిస్ట్రార్ రాహుల్ రాజ్, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## మోటకొండూరులో ఏసీబీ దాడి



**మోటకొండూరు, మే 16 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో శనివారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్మెన్ (ఏఎల్‌ఎం)గా విధులు నిర్వహిస్తున్న రమేష్ అనే ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు.

### రూ. 35,000 డిమాండ్

స్థానిక వివరాల ప్రకారం.. మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ అవసరాల నిమిత్తం విద్యుత్ పనుల కోసం అసిస్టెంట్ లైన్మెన్ రమేష్‌ను ఆశ్రయించాడు. అయితే, ఆ పని చేసి పెట్టేందుకు రమేష్ సదరు రైతు వద్ద నుండి 35,000 రూపాయలు లంచంగా డిమాండ్ చేశాడు. అంత పెద్ద మొత్తంలో లంచం ఇచ్చుకోలేక, అవినీతికి లొంగడం ఇష్టం లేని ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

### రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్

రైతు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో నిఘా పెట్టారు. శనివారం మండల కేంద్రంలో రైతు నుండి అసిస్టెంట్ లైన్మెన్ రమేష్ 35,000 రూపాయల లంచం డబ్బులు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి రంగుల డబ్బులతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మోటకొండూరు విద్యుత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తూ విచారణ జరుపుతున్నారు. మండల కేంద్రంలో ఏసీబీ దాడి జరగడంతో ఒక్కసారిగా ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగుల్లో వణుకు మొదలైంది.

## బోర్‌బావిలో పడ్డ మనువడిని కాపాడి తాత మృతి

**మిర్యాలగూడ, మే 16 (జనంసాక్షి) :** బోర్‌బావిలో పడ్డ మనువడిని కాపాడి తాత మృతి చెందిన విషాద సంఘటన మిర్యాలగూడ మండలంలో చోటు చేసుకున్నది. మండల పరిధి లోని ఉట్లపల్లి గ్రామంలో శనివారం నాడు యాదగిరిపల్లి వెంకన్న నాలుగేళ్ల మనువడు ఆడుకుంటూ ప్రమాదవషాత్తు తెరిచి ఉంచిన బోర్ గుంటలో పడిపోయాడు. గమనించిన తాత గుంత లో పడిన మనువడిని కాపాడడానికి బోర్ గుంటలోకి దిగి ఇరుక్కు పోయాడు.గ్రామస్తులు భయందోళనతో కేకలు వెయ్యగా,గ్రామస్తులు రూరల్ పోలీస్ లకి సమాచారం ఇవ్వడం తోవెంటనే రిస్క్యూ సిబ్బంది తో ఘటనా స్థలానికి చేరుకొన్న రూరల్ పోలీస్ లు ఇద్దరినీ బోర్ బావి నుండి బయటకు లాగారు.చిన్నారి ప్రాణాలతో బయట పడగా, మనువడిని కాపాడటానికి బోర్ గుంటలోకి దిగిన తాత యాదగిరిపల్లి వెంకన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రి కి తీసుకు వెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గ మధ్యలో కన్నుమూయడం జరిగింది.

## అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు

- డీఎస్పీ ఆదినారాయణ



**చంద్రుగొండ, మే 16 (జనం సాక్షి) :** అక్రమ పశువుల రవాణాకు సహకరించే వారిపై, రవాణా నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై శివరామకృష్ణతో కలిసి మాట్లాడారు. అనంతరం నిందితులు మొయిజ్ ఖురేషి, ఇస్మాయిల్ , నాగుల్ మీరా, సయ్యద్ పీర్ మహమ్మద్, సయ్యద్ ఖాజా పాషా, ఎండ్ ఖురేషి లను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అక్రమ రవాణాపై ఎవరికైనా సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి




**బుర్గంపహాడ్, మే 16 (జనంసాక్షి) :** రోగులకు అవసరమైన ఔషధాలను విక్రయించే విధానంలో ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక జీయర్ మఠం లో దేశవ్యాప్త బంద్ కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ఫార్మా రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. ఈ ఫార్మసీ విక్రయాల ద్వారా ప్రజా ఆరోగ్యానికి ముప్పు ఉందన్నారు. ఆధునిక సాంకేతికతను అడ్డుపెట్టుకొని నకిలీ ప్రిస్క్రిప్షన్ ద్వారా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఉందని హెచ్చరించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవడమే కాకుండా, దేశంలో ఈ ఫార్మసీ విధానాన్ని పూర్తి గా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి నాగేశ్వరావు మాట్లాడుతూ మందుల దుకాణాల యజమానుల సమస్యలపై ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా బంద్‌లో భాగంగా భద్రాచలం లో కూడా దుకాణాలను బంద్ చేసి, విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపుల యజమానులు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరంలో వడ్లతో బీఆర్ఎస్ రాజకీయం



**రామన్నపేట, మే 16 (జనంసాక్షి) :** రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరంలో వడ్లతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేస్తూ గ్రామ రైతులను, అధికారులను గందరగోళంలో పెడుతున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఘాటుగా విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామన్నపేట మండలంలో అత్యధికంగా వరి సాగు చేసే కొన్ని గ్రామాలలో ఇంద్రపాలనగరం ఒకటి. వరి దిగుబడికి తగ్గట్టుగానే గ్రామంలో ప్రభుత్వం, అధికారులు ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సాఫీగా కొనుగోలను నిర్వహిస్తున్నారు. ఆ గ్రామ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులకు సహకరించాల్సింది పోయి ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. కావాలని ఎమ్మెల్యే వేముల వీరేశంను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెండు కొనుగోలు కేంద్రాలలో రైతులు వడ్లు పోయడానికి స్థలం ఉన్నప్పటికీ, కొనుగోలు సాఫీగా సాగుతున్నప్పటికీ సర్పంచ్ అనుయాయులు, బిఆర్ఎస్ నాయకులు మరొకచోట వడ్లు రాశులు పోసి మా వడ్లే ముందు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పూర్తయిన తర్వాత అక్కడ కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్న పట్టించుకోకుండా రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కావాలని ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. రైతులకు మేలు చెయ్యకపోగా బిఆర్ఎస్ నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు అరాచకాలు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని, ఎమ్మెల్యేను బదనం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## చైన్ స్నాచర్లు పట్టివేత



**నల్లగొండ ప్రతినిధి, మే 16 (జనం సాక్షి) :** తిప్పర్తి మండలం ఎర్రగడ్డ గూడెం లో ఈ నెల 11వ తేదీన మర్రి చెట్టు క్రింద కూర్చున్న చింతమల్ల సత్యమ్మ 70 ఏండ్ల వృద్ధురాలు మెడ లో ఉన్న 30 గ్రాములు బంగారు గొలుసు ని అదును చూసి ఒంటరిగా ఉంది అని గమనించి బాణాలు హరి చంద్ర ప్రసాద్ అతని మిత్రుడు మైనర్ బాలుడు ఇద్దరు మహిళ మీద ఉన్న గొలుసు లాక్కెళ్లారు. ఇదే విషయమై మహిళ తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా తిప్పర్తి ఎస్ఐ శంకర్ వారి బృందం అలాగే సీసీఎస్ బృందం రెండు బృందాలుగా ఏర్పడి డిఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో రెక్కీ నిర్వహించి అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి దర్యాప్తు చేయగా వాహనాలు తనిఖీ చేస్తున్న తరుణం లో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడనికి ప్రయత్నం చేయగా పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకున్నారు అని డిఎస్పీ శివరాం రెడ్డి తెలిపారు.అలాగే వారి మీద 304,302 కేసులు నమోదు చేసినట్లు వారి వద్ద రెండు .మొబైల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడం లో కీలకంగా వ్యవహరించిన జితేందర్ రెడ్డి సీసీఎస్ సీఐ, తిప్పర్తి ఎస్ ఐ శంకర్,విష్ణు వర్ధన్ గిరి హెడ్ కానిస్టేబుల్, నాగార్జున ప్రసాద్ హెడ్ కానిస్టేబుల్, పుష్పగిరి,వహిద్ షా,శ్రీనివాస్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్,నరేష్ కానిస్టేబుల్, శివరాజ్,సాయి,దస్తగిరి,రాం రెడ్డి తిప్పర్తి పోలీసు స్టేషన్ సిబ్బంది ని డిఎస్పీ అభినందించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి



**యాదాద్రి ప్రతినిధి, మే 16 (జనం సాక్షి) :** జిల్లాలో జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి, ఇంటింటి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకా రెడ్డి ,ఎఆర్డీఓ కృష్ణా రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి, మండల తహసిల్దార్ లు, సంబంధిత అధికారులకు పాల్గొన్నారు.

## గందరగోళంలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులు

- సిబిల్ స్కోర్ నిబంధనతో ఆందోళన
- అధికారుల నియంత్రణ లోపించడంతో సమస్యలు



**మునుగోడు, మే 16 (జనం సాక్షి) :** మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూ గందరగోళానికి దారితీసింది.. మండల వ్యాప్తంగా 2025-26 సంవత్సరమునకు గాను ఎస్సీ కార్పొరేషన్ రుణాల కొరకు దాదాపుగా రెండు వందల పైగా దరఖాస్తులు వచ్చినట్లుగా తెలుస్తుంది. అయితే మండల ప్రత్యేక అధికారుల నియంత్రణ లోపమో ముందస్తు ప్రణాళిక లేకపోవడం ఏమో తెలియదు కానీ లబ్ధిదారులు ఒక్కసారిగా ఇంటర్వ్యూ కోసం ఎంపీడీవో గది ముందు గుమిగుడారు.ఒకరిపై మరొకరు నెట్టివేసుకోవడంతో లబ్ధిదారులలో సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలు ఇలా ఉండగా కనీసం లబ్ధిదారులకు గ్రామస్థాయిలో అధికారులు సరైన సమాచారం అందించకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ప్రాజెక్టు రిపోర్టులు, పాస్ ఫోటోలు, రేషన్, ఆధార్ కార్డు వంటి పత్రాలు సరిగా లేకపోవడంతో ఇంటర్వ్యూలో లబ్ధిదారులు రుణాల ఎంపికకు తిరస్కరించే అవకాశం ఉందని లబ్ధిదారులు అధికారులపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకర్లు సిబిల్ స్కోర్ ప్రామాణికంగా ఎంపిక ఉంటుందని తెలపడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఉన్నత అధికారులు చొరవ చూపి బ్యాంక్ సిబిల్ స్కోర్ నిబంధనలను ఎత్తివేసే విధంగా చర్యలు చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుగేందర్ రెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు యూబీఐ కృషి



**గద్వాల నడిగడ్డ, మే 26 (జనం సాక్షి) :** దేశ సమగ్ర అభివృద్ధి, గ్రామీణ పురోగతి, మహిళా సాధికారతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని యుబిఐ మహబూబ్నగర్ ప్రాంతీయ హెడ్ వెంకటేశ్వర్లు అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న యూనియన్ తేజస్ ప్రచారం కింద వ్యవసాయ అవుట్ రీచ్ క్యాంప్ లో భాగంగా హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గద్వాలలోని జిల్లా మహిళా సమైక్య భవనంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు వ్యవసాయ రుణాలు మొత్తం రూ.5.32 కోట్ల విలువైన చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు బలాన్ని చేకూర్చేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ప్రాధాన్యతను గుర్తించి రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత వ్యాపారులకు రుణాలు, రైతులకు పంట రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామీణ నిరుద్యోగ యువత బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాసులు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రావు, బ్యాంకు గద్వాల మేనేజర్ ముఖేష్, శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షణ చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 16 (జనం సాక్షి) :** ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ,రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఆర్డీఓలు, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా, మార్కెటింగ్, మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు,ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

# రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

- మిల్లుల వద్ద 12 గంటల్లోపు అన్‌లోడింగ్ పూర్తి కావాలి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 16 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రారంభంలో రోజుకు 5 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు.ఇకపై ఆ వేగాన్ని పెంచి రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సమయానికి లారీలు రావడం లేదని, వచ్చిన లారీలను కూడా సెంటర్ ఇంచార్జ్ లు కొన్ని నిర్దిష్ట మిల్లులకు మాత్రమే ఎక్కువగా పంపిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.దీనివల్ల మిల్లుల వద్ద లారీలు గంటల తరబడి నిలిచిపోతున్నాయన్నారు. మండల తహశీల్దార్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని, మిల్లుల వద్ద ఎక్కువ లారీలు నిలిచిపోయిన చోట త్వరితగతిన అన్ లోడింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. మిల్లుకు చేరుకున్న లారీలు 12 గంటల లోపు అన్ లోడింగ్ పూర్తి చేయాలని, ఒకవేళ 12 గంటల లోపు అన్ లోడింగ్ ప్రారంభం కాకపోతే, వెంటనే ఆ లారీలను ప్రత్యామ్నాయ అన్ లోడింగ్ పాయింట్లకు మళ్లించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నుండి లారీలో ధాన్యం లోడింగ్ పూర్తి చేసి, 3 గంటల లోపు మిల్లుకు తరలించాలన్నారు.ఏ మిల్లుకు ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి, ఎంత అన్ లోడింగ్ జరిగిందనే రిపోర్టుతో పాటు, కొనుగోలు కేంద్రాలకు ఎన్ని లారీలు వస్తున్నాయనే పూర్తి వివరాలను రోజువారీగా ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహన్ బాబు, డిసిఓ ప్రవీణ్ కుమార్,సివిల్ సప్లైస్ డీఎం శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## రూ.100 కోట్ల బిజినెస్‌ను మూసేస్తున్నా

### వ్యాపారవేత్త సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ:**కంటెంట్ క్రియేటర్, వ్యాపారవేత్త అంకుర్ వారికూ సంచలన ప్రకటన చేశారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందించే తన రూ. 100 కోట్ల ఆన్‌లైన్ వ్యాపారాన్ని మూసివేయనున్నట్లు ప్రకటించారు. 2020లో ప్రారంభించిన వెబ్‌వేద అనే ఆన్‌లైన్ కోర్సు బిజినెస్ తాను ఊహించిన దాని కంటే.. ఎంతో వృద్ధి చెందిందన్నారు. అయినప్పటికీ దీనిని ఇంకా కొనసాగించడంలో అర్థం లేదంటూ.. ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఇది నెట్టింట తీవ్ర చర్చకు దారి తీసింది. 'నేను నా రూ.100 కోట్ల ఆన్‌లైన్ కోర్సుల బిజినెస్‌ను మూసివేస్తున్నా. 2020లో వెబ్‌వేద ప్రారంభమైనప్పటి నుంచి నేను ఊహించిన దానికంటే ఇది ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పటివరకు 5 లక్షల మంది విద్యార్థులు కోర్సులు నేర్చుకున్నారు. రూ.100 కోట్ల అమ్మకాలు సాగాయి. రూ.25 కోట్లు లాభాలు వచ్చాయి. అయినా.. దీనిని ఇంకా ఇలాగే కొనసాగించడంలో అర్థం లేదు' అని ఆయన తన పోస్టులో రాసు కొచ్చారు. తన నిర్ణయం గురించిన పూర్తి వివరాలను శనివారం మరో వీడియోలో వెల్లడిస్తానని తెలిపారు. ఈ పోస్టు నెట్టింట వైరల్ అవుతుండగా.. అంకుర్ ప్రకటనపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అంకుర్ నిర్ణయం వెనుక కృత్రిమ మేధ కారణమా అని ఓ నెటిజన్ ప్రశ్నిం చగా, అయ్యుండొచ్చని సమాధానమిచ్చారు. కాగా.. అంకుర్ మరో కొత్త వ్యాపారాన్ని ఏమైనా ప్రారంభించనున్నాడా అనే సందేహాలను కూడా నెటిజన్లు వ్యక్తం చేశారు.


## రూపాయి.. చమురు దెబ్బకు మార్కెట్లు విలవిల



### లాభాల నుంచి నష్టాల్లోకి మార్కెట్లు

### ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1329 కోట్లు

### డీఐఐ విక్రయాలు: రూ.1959 కోట్లు



**న్యూఢిల్లీ:**దేశీయ సూచీలు శుక్రవారం లాభాల్లో ప్రారంభమైనా, నష్టాల్లో ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు కనిష్ఠమైన 96 స్థాయికి పడిపోవడం, ముడిచమురు ధర మళ్లీ పెరగడం ఇందుకు ప్రధాన కారణం. లోహ, చమురు-గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచడంతో మదుపర్లను ద్రవ్యోల్బణ భయాలు కలవరపెట్టాయి. బ్యారెల్ ముడిచమురు ధర 3% పెరిగి 109.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నీ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.26 లక్షల కోట్లు తగ్గి రూ.460.59 లక్షల కోట్ల (4.8 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 99 పాయింట్ల (క్రితం ముగింపు 75,398.72) లాభంతో 75,497.10 పాయింట్ల వద్ద ప్రారంభమై, ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 75,139.41 పాయింట్లకు పడిపోయింది. చివరకు 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.10 పాయింట్లు తగ్గి 23,643.50 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. టాటా స్టీల్ 1.97%, ఎటర్నల్ 1.93%, రిలయన్స్ 1.87%, అల్ట్రాటెక్ 1.83%, ఎస్‌బీఐ 1.69%, ఎం అండ్ ఎం 1.56%, బీఈఎల్ 1.22%, ఎల్ అండ్ టీ 0.85% డీలాపడ్డాయి. ఇన్ఫోసిస్ 2.08%, టెక్ మహీంద్రా 1.86%, పవర్‌గ్రిడ్ 1.34%, అదానీ పోర్ట్స్ 1.27%, మారుతీ 1.14%, ఎయిర్‌టెల్ 1.13% లాభపడ్డాయి. చమురు, రంగుల షేర్లు డీలా: పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నేపథ్యంలో చమురు మార్కెటింగ్, రంగుల కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. చమురు కంపెనీల్లో బీపీసీఎల్ 2.71%, హెచ్‌పీసీఎల్ 2.39%, ఐఓసీ 1.85% పడ్డాయి. ఇండిగో పెయింట్స్ 1.36%, ఏషియన్ పెయింట్స్ 0.42%, బెర్జర్ 0.14% నష్టాలు నమోదుచేశాయి.

## ఆ రాష్ట్రంలో నిలిచిపోనున్న క్యాబ్, రైడ్ సేవలు..!

మహారాష్ట్రలో క్యాబ్, రైడ్ సేవలు నిలిచిపోనున్నాయి. తమ యాప్ స్టోర్స్ నుంచి ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్స్‌ను తొలగించాలంటూ యాపిల్, గూగుల్‌కు మహారాష్ట్ర స్టేట్ సైబర్ డిపార్ట్‌మెంట్ నోటీసులు జారీ చేసింది. అక్రమంగా బైక్ ట్యాక్సీ సేవలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ సైబర్ విభాగానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే గూగుల్, యాపిల్ సంస్థలకు సైబర్ విభాగం నోటీసులు జారీ చేసింది. ఈ యాప్స్ వేదికగా చట్టవిరుద్ధంగా బైక్ సర్వీసులు అందుతున్నాయని వాటిల్లో అధికారులు పేర్కొన్నారు. రవాణాశాఖ, మోటార్ వాహనాల నిబంధనలు పాటించకుండా ఈ రైడ్‌లను నడుపుతున్నాయని వెల్లడించారు. కర్ణాటక కూడా గతంలో ఈ తరహా ఆదేశాలు ఇచ్చింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఆ రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. తర్వాత ఓలా, ఉబర్ వంటి సంస్థలు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశాయి. విచారణ అనంతరం న్యాయస్థానం ఆ తీర్పును పక్కనపెట్టింది. మోటార్ వాహనం చట్టం ప్రకారం బైక్ ట్యాక్సీలను రవాణా వాహనాలుగా పరిగణిస్తూ, చట్టబద్ధమైన అనుమతులతో నడుపుకోవచ్చని అనుమతి ఇచ్చింది.

## ఇక రిటర్నులు దాఖలు చేయొచ్చు

హైదరాబాద్: పన్ను చెల్లింపుదారులు 2026-27 మదింపు సంవత్సరానికి గాను ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు శుక్రవారం నుంచే వీలు కల్పించినట్లు ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. ఈ ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీ, ఆన్‌లైన్ ఫైలింగ్ సౌకర్యం ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని ఐటీ విభాగం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేయడానికి వీలుగా ఈ ఫారాలను మార్చి 30నే నోటిఫై చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్ ఫైలింగ్, ఎక్సెల్ యుటిలిటీ అందుబాటులోకి రావడంతో పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నుల దాఖలును ప్రారంభించొచ్చు. జులై 31 వరకు: వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్-1 దాఖలు చేయడానికి జులై 31ని చివరి తేదీగా నిర్ణయించారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,48,800 (22 క్యారెట్లు) | ₹ 1,62,330 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,15,000

## రూపాయిపై ఒత్తిడెందుకు?

- సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం
- అంతర్జాతీయ విద్య మరింత భారం



**న్యూఢిల్లీ:**అమెరికా డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ మరింత కనిష్ఠ స్థాయికి చేరింది. పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధరలను పెంచడంతో, రవాణా దగ్గర నుంచి అన్ని రకాల వస్తు, సేవల వ్యయాలు అధికమయ్యే పరిస్థితి ఉంది. ఈ ఏడాది జనవరిలో డాలర్ విలువ రూ.90 కాగా, ఇప్పుడు రూ.96కు చేరడంతో, దిగుమతి చేసుకునే వస్తువులన్నీ ఖరీదవుతున్నాయి. డాలర్ చెల్లింపులతో ముడిపడినవన్నీ ఆర్థిక భారం కలిగించడం ఖాయం. ఏ దేశ కరెన్సీ విలువ జీవనకాల కనిష్ఠాలకు చేరినా అది హెచ్చరికలాంటిదే. నెలవారీ నిత్యావసరాల బిల్లు, రోజువారీ ప్రయాణ వ్యయాలు, అంతర్జాతీయ విద్యా ఖర్చులు మరింత అధికమవుతాయి. ఆహార వస్తువులు, వంట నూనెలు, ప్యాకేజ్డ్ వస్తువుల ధరలూ క్రమంగా పెరుగుతాయి. మనదేశం నుంచి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు లక్షల్లో ఉంటారు. వీరికి నెల వారీ పంపించాల్సిన మొత్తం అంతకంతకూ పెరుగుతోంది. రూపాయి మారకపు విలువ 5.5% క్షీణిస్తే.. నెలవారీ రూ.50,000 బడ్జెట్‌తో బండి నడిపే మధ్యతరగతి కుటుంబ కొనుగోలు శక్తి, రూ.2,500-3,500 వరకు తగ్గుతుందన్నది ఒక లెక్క. దీనిని దృష్టిలో పెట్టుకునే 'ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని' ఇటీవల ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. శుక్రవారం నాటి ఇంటర్‌బ్యాంక్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రా డే ట్రేడింగ్‌లో ఆల్‌టైం కనిష్ఠమైన 96.14కు చేరింది. చివరకు 95.86 వద్ద స్థిరపడింది. ముగింపు పరంగా ఇది కూడా రికార్డు కనిష్ఠ స్థాయే. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువ 6% క్షీణించింది. గత 6 ట్రేడింగ్ రోజుల్లోనే 2% తగ్గింది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధ ప్రభావం మరింత తీవ్రరూపం దాల్చొచ్చనే అంచనాల మధ్య ముడిచమురు ధర పెరుగుతోంది. అమెరికాలో రిటెయిల్ విక్రయాలు బాగుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్ రేట్ల కోత విధిస్తారనే అంచనాల మధ్య డాలర్ సూచీ రాణించింది. మనదేశ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు(ఎఫ్ఐఐ) పెట్టుబడులను ఉపసంహరిస్తూనే ఉండడమూ ప్రభావం చూపుతోంది. ఇవన్నీ కలిసి రూపాయిపై ఒత్తిడి పెంచాయి. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే, రూపాయికి కొంతమేర మద్దతు లభించొచ్చని విశ్లేషకులు అంటున్నారు.

## ఏకాభిప్రాయాలతోనే సరి..

### కొత్త ఒప్పందాలు లేకుండానే చైనాలో ముగిసిన ట్రంప్ పర్యటన



**బీజింగ్:** యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ట్రంప్ చైనా పర్యటన.. ఒప్పంద ప్రకటనలేవీ లేకుండానే ముగిసింది. కీలకాంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని, ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణలో కీలక పురోగతి సాధించామని చెప్పడానికి మాత్రమే అమెరికా, చైనా పరిమితమయ్యాయి. బోయింగ్ సంస్థ నుంచి 200 విమానాలను కొనుగోలు చేయడానికి బీజింగ్ సమ్మతించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించినా.. దానిపై అధికారిక ప్రకటన రాలేదు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర చర్చల్లో పాల్గొనేందుకు ట్రంప్ బుధవారం బీజింగ్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. గురు, శుక్రవారాల్లో వీరిద్దరూ పలు దఫాలు సమావేశమై.. ఇరాన్ యుద్ధం, ద్వైపాక్షిక వాణిజ్యం సహా పలు అంశాలపై విస్తృత స్థాయిలో సమాలోచనలు జరిపారు. బీజింగ్‌లోని ఝోంగ్నన్హై నివాసంలో సమావేశంతో వారి శిఖరాగ్ర చర్చలు శుక్రవారం ముగిశాయి. చైనాలో తన పర్యటనను 'అత్యంత విజయవంతమైనది'గా, 'మరుపురానిది'గా ట్రంప్ అభివర్ణించారు. అమెరికాకు తిరుగుప్రయాణంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. "మేం చాలా విషయాలపై అంగీకారం కుదుర్చుకున్నాం. చాలా ఒప్పందాలు చేసుకున్నాం. విభేదాలను పరిష్కరించుకున్నాం" అని వ్యాఖ్యానించారు. రాబోయే దశాబ్ద కాలంలో బోయింగ్ నుంచి 200 విమానాలను చైనా కొనుగోలు చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఈ మేరకు తన పర్యటనలో ఒప్పందం కుదిరిందన్నారు. ముందుముందు బోయింగ్ నుంచి మొత్తంగా 750 విమానాలను బీజింగ్ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే దీనిపై బోయింగ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను కొనేందుకూ చైనా సిద్ధమని జిన్‌పింగ్ తనకు చెప్పినట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్ పనైపోయిందని ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడం.. లేదంటే విధ్వంసానికి గురవడం అనే రెండు ఐచ్ఛికాలే ఆ దేశం ముందున్నాయని వ్యాఖ్యానించారు. ఖర్గ్ దీవిని కేవలం 4-5 నిమిషాల్లోనే నాశనం చేయగలమన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య ఒప్పందం కుదరాలని జిన్‌పింగ్ ఆకాంక్షిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్ నుంచి చమురును కొనుగోలు చేసే చైనా సంస్థలపై ఆంక్షలను ఎత్తివేయడంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి తాను అంగీకరిం చడాన్ని పాకిస్థాన్‌కు చేసిన మేలుగా ట్రంప్ వ్యాఖ్యానించా రు. అమెరికా-చైనా మధ్య ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కమ్యూనికేషన్‌ను, సమన్వయాన్ని బలోపేతం చేసుకోవాలని ట్రంప్, తాను తాజా భేటీలో నిర్ణయించినట్లు జిన్‌పింగ్ పేర్కొన్నారు. జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు ఈ ఏడాది శరదృతువులో (సెప్టెంబరు-నవంబరు మధ్య) వెళ్తారని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు. హర్మూజ్ సహా పలు వివాదాస్పద అంశాలపై ట్రంప్, జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయాల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జైకున్ నేరుగా సమాధానాలివ్వకుండా దాటవేశారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో అమెరికా-చైనా ప్రతినిధుల మధ్య జరిగిన భేటీలో ఒక్క మహిళకు కూడా ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. జిన్‌పింగ్ వ్యాఖ్య.. బైడెన్ హయాం గురించి అమెరికాను పతనావస్థలోని దేశంగా తన పర్యటనలో జిన్‌పింగ్ వ్యాఖ్యానించడంపై ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో స్పందించారు. ఆ మాటతో తాను 100% ఏకీభవిస్తున్నానని.. కానీ ఆయన చెప్పింది నిద్రమత్తులో ఉండే జో బైడెన్ హయాం గురించి అని పేర్కొన్నారు. బైడెన్ పాలనలో అమెరికాకు అపార నష్టం వాటిల్లిందన్నారు. తన పాలనలో మాత్రం దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు.



## అమెరికా 'వాతావరణం' బాగోలేదు

### జర్మన్ ఛాన్సలర్

బెర్లిన్: అమెరికాలో చదువుకు, ఉద్యోగాలకు వెళతామని తన పిల్లలు చెబితే, సరేనంటూ వారిని ప్రోత్సహించలేనని.. ఆ దేశంలో ఉన్నపళంగా మారిన 'సామాజిక వాతావరణం' ఇందుకు కారణంగా జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ శుక్రవారం వ్యాఖ్యానించారు. "వాస్తవానికి నేను అమెరికాకు గొప్ప అభిమానిని. కానీ, ప్రస్తుతానికి ఆ అభిమానం పెరగడం లేదు" అంటూ వర్జ్‌బర్గ్‌లోని క్యాథలిక్ కాంగ్రెస్ ప్యానెల్ చర్చల్లో ఆయన తెలిపారు. బాగా చదువుకొన్న యువత ఏమి సాధించగలరనే ప్రశ్నకు అమెరికాలో ఏడాది కిందటిదాకా భిన్నమైన సమాధానాలు లభించేవన్నారు. నేటి అమెరికాలో ఉన్నత విద్యావంతులు ఉద్యోగం సంపాదించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చైనా పర్యటన నుంచి వెనుదిరుగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాను ఫోనులో మాట్లాడినట్లు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తెలిపారు. "ఇరాన్ చర్చలకు వచ్చి, హర్మూజ్ జలసంధి తెరవాల్సిందే" అంటూ తామిద్దరం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఆయన 'ఎక్స్' ద్వారా తెలిపారు.

## భారీగా పసిడి, వెండి దిగుమతులు

### ఏప్రిల్‌లో వరుసగా 82%, 157% పెరిగాయ్

### రాబోయే నెలల్లో తగ్గే అవకాశం



**న్యూఢిల్లీ:**మనదేశంలోకి పసిడి, వెండి దిగుమతులు ఏప్రిల్‌లో భారీగా పెరిగాయి. ఈ లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని పెంచినందున, రాబోయే నెలల్లో ఈ దిగుమతులు తగ్గొచ్చని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. శుక్రవారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. పసిడి దిగుమతులు 81.69% పెరిగి 5.62 బి. డాలర్ల (సుమారు రూ.52,000 కోట్ల)కు చేరుకున్నాయి. వెండి దిగుమతులు 157.16% వృద్ధితో 411 మి. డాలర్ల(దాదాపు రూ.3,800 కోట్ల)కు చేరాయి. 2025-26 మొత్తంమీద 71.98 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.69 లక్షల కోట్ల) పసిడి దిగుమతి అయ్యింది. 2024-25 కంటే విలువ పరంగా ఇది 24% అధికం. పరిమాణం పరంగా 4.76% తగ్గి 721.03 టన్నులకు పరిమితమైంది, యూఏఈకి ఇచ్చిన టారిఫ్ కోటా మినహాయింపు(టీఆర్‌క్యూ) వాటా ఇందులో 8.58 టన్నులే ఉందని అగర్వాల్ తెలిపారు. 2025-26లో వెండి దిగుమతులు 150% వృద్ధితో 12 బి. డాలర్లకు చేరుకున్నాయి. పరిమాణ పరంగా 42% పెరిగి 7334.96 టన్నులుగా నమోదైంది. ఏప్రిల్‌లో మొత్తం భారత ఎగుమతులు 13.78% పెరిగి 43.56 బి. డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. వృద్ధి పరంగా ఇవి 5 నెలల గరిష్ఠం కాగా, పరిమాణం పరంగా నాలుగేళ్లలోనే అత్యధిక నెలవారీ ఎగుమతులు ఇవే. అయితే దిగుమతులు కూడా 10% పెరిగి 71.94 బి. డాలర్ల (సుమారు రూ.6.76 లక్షల కోట్ల)కు చేరుకోవడంతో వాణిజ్య లోటు ఏప్రిల్‌లో మూడు నెలల గరిష్ఠమైన 28.38 బి. డాలర్ల (దాదాపు రూ.2.66 లక్షల కోట్ల)కు చేరుకుంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమా, దేశ ఎగుమతులు ఆరోగ్యకర వృద్ధిని నమోదు చేశాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులు(40.31%), మాంసం, డెయిరీ(48%), పెట్రోలియం ఉత్పత్తులు(34.66%), ఇంజినీరింగ్ వస్తువులు(8.76%), ఫార్మా(7.12%) వంటివి రాణించడంతో ఎగుమతుల్లో మంచి వృద్ధి సాధ్యమైంది.

## న్యాయవ్యవస్థ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి

మాత్రమే అన్నారు. సాంకేతికత వల్లే ఇది సాధ్యమైందని పేర్కొ న్నారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్య వస్థ పనితీరులో మరింత పారదర్శకతను తీసుకు రావడానికి సాంకేతికత సహాయపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. సాంకేతిక పురోగతిని సౌకర్యానికి సంబంధించిన విషయంగా కాకుండా రాజ్యాంగ అవసరంగా చూడాలన్నారు. న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిజిటల్ వ్యవస్థలు సహాయపడతాయన్నారు. కోర్టు కేసుల్లో జాప్యాలు, అసమర్థతలకు సాంకేతికతే అత్యంత ప్రభావవంతమైన పరిష్కారమని ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయ పడ్డారు. .

**బొద్దింక వ్యాఖ్యలపై సుప్రీం సిజెఐ వివరణ**

ఎలాంటి ఉద్యోగాలు లభించని, ఏ వృత్తిని చేపట్టని కొందరు యువత బొద్దింకల్లా తయారవుతున్నారని, వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. తన నోటి మాటలను ఒక వర్గం మీడియా వక్రీకరించిందని, దేశంలోని యువతను విమర్శించినట్టుగా తప్పుగా చిత్రీకరించిందని అన్నారు.


## బెర్ముడా గుట్టు వీడింది!



**వాషింగ్టన్:**అట్లాంటిక్ మహాసముద్రంలోని బెర్ముడా ట్రయాంగిల్ అనగానే.. అంతుచిక్కని రీతిలో అదృశ్యమైన విమానా లు, నౌకలు కథలే మనకు గుర్తుకొస్తాయి. అక్కడేదో నిగూఢ శక్తి ఉందన్న వాదననూ మనం వినే ఉంటాం. వీటిని పరిశోధకులు కొట్టిపారేస్తుంటారు. ఆ సంగతి పక్కనపెడితే.. బెర్ముడా ప్రాంతానికి సంబంధించిన మరో అంశం దశాబ్దాలుగా శాస్త్రవేత్తలకు అంతుచిక్కకుండా ఉంది. ఆ గుట్టు తాజాగా వీడింది. బెర్ముడా దీవుల వద్ద 3 కోట్ల సంవత్సరాలుగా అగ్నిపర్వత విస్ఫోటాలు లేకపోయినప్పటికీ.. పరిసరాల్లోని సాగరగర్భం కన్నా అవి ఎందుకు ఎత్తయిన ప్రదేశంపై కొనసాగుతున్నా యన్నది పరిశోధకులు గుర్తించారు. హవాయ్ వంటి అనేక అగ్నిపర్వత దీవుల సమూహాలు.. భూమిలోని మ్యాంటిల్ పొర నుంచి చొచ్చుకొచ్చిన వేడి, తేలియాడే రాతి భాగం(మ్యాంటిల్ ప్లూమ్)పై ఏర్పడుతుంటాయి. ఈ పదార్థం పైకి చొచ్చుకొచ్చేకొద్దీ అగ్నిపర్వతాలు పుట్టు కొస్తాయి. ఫలితంగా అక్కడి సాగరగర్భం ఒకింత ఉబ్బె త్తుగా మారుతుంది. కొంతకాలానికి భూ ఎగువపొరలోని ఫలకాలు ప్లూమ్ నుంచి దూరం జరుగుతాయి. దీంతో అగ్నిపర్వత చర్య చల్లారి, ఉబ్బెత్తు ప్రదేశం తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటుంది. బెర్ముడాలో మాత్రం అలా జరగలేదు. అది.. పరిసరాల కన్నా సుమారు 1,600 అడుగుల ఎత్తయిన ఉబ్బెత్తు ప్రదేశంపై ఉంది. 3 కోట్ల సంవత్సరాలుగా అక్కడ అగ్నిపర్వత చర్యలు లేకున్నప్పటికీ ఆ ప్రదేశం ఇంకా కిందకి దిగకపోవడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై కార్నెగీ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ సైన్స్‌కు చెందిన విలియం ఫ్రేజర్, యేల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త జెఫ్రీ పార్క్ నేతృత్వం లోని పరిశోధక బృందం దీనిపై దృష్టిసారించింది. భారీ భూకంపాల కారణంగా ఉత్పన్నమైన సైస్మిక్ తరంగాలపై వారు ఆధారపడ్డారు. ఈ తరంగాలు భూమి గుండా చొచ్చుకెళతాయి. ఈ క్రమంలో ఎదురయ్యే పదార్థ సాంద్రత, అందులోని మూలకాలను బట్టి వాటి వేగం పెరగడమో తగ్గడమో జరుగుతుంది. బెర్ముడాపై ఉన్న ఒక భూప్రకంపన అధ్యయన కేంద్రంలో నమోదైన డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. తద్వారా ఆ దీవి కిందన 20మైళ్ల వరకూ విస్తరించిన భూ అంతర్భాగ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో అనూహ్య అంశం వెలుగుచూసింది. అక్కడ భూపైపొర (కస్టు) కిందన 12 మైళ్ల మందం కలిగిన ఒక శిలాపొర కనిపించింది. ఈ శిల పరిసరాల్లోని మ్యాంటిల్ భాగం కన్నా తక్కువ సాం ద్రతను కలిగి ఉంది. అందువల్ల అసాధారణ స్థాయిలో తేలియాడే తత్వాన్ని సొంతం చేసుకుంది. అది ఒక బల్లక ట్టులా వ్యవహరిస్తూ సాగరగర్భాన్ని, బెర్ముడాను తేలియా డేలా చూస్తోంది. ఈ రాతిపొరను అండర్‌ప్లేటింగ్‌గా పిలుస్తున్నారు. కోట్ల సంవత్సరాల కిందట బెర్ముడా ప్రాంతంలో క్రియాశీల అగ్నిపర్వతాలు ఉన్నప్పుడు భూమి లోతుల్లో నుంచి చొచ్చుకొచ్చిన శిలాద్రవం చల్లబడి ఇది రూపుదిద్దుకొని ఉండొచ్చని అంచనావేస్తున్నారు.

## విద్యార్థులు కళా రంగాల్లోనూ ప్రతిభ చాటాలి

- సృజనాత్మకంగా ఆలోచిస్తే కళల్లో రాణింపు
- విద్యా వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ మే 16 (జనం సాక్షి);** విద్యార్థులు చదువుతోపాటు కళా రంగాల్లోనూ ప్రతిభ చాటాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో శనివారం ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ డే కార్యక్రమాలను ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్న సృజనాత్మకతను అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. విద్యార్థులతోపాటు పలువురు ఉపాధ్యాయులు తయారుచేసిన క్రాఫ్ట్, ఆర్ట్ వస్తువులు అలంకరణకు, కానుకలుగా ఇచ్చేందుకు కూడా వినియోగించవచ్చున్నారు. విద్యార్థులు నృత్య, నాటక ప్రదర్శనలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఆయా కళల్లో రాణించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు మైఖేల్, ప్రసాద్, జ్యోతి, కర్రెప్ప, వివిధ మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హైదరాబాద్-జైపూర్ స్పెషల్ రైలులో అగ్నిప్రమాదం

### ఖాళీ కోచ్‌లో మంటలు, తప్పిన భారీ ప్రమాదం




**సికింద్రాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్-జైపూర్ స్పెషల్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 7:50 గంటలకు బయలుదేరాల్సి న ఈ ప్రత్యేక రైలును సాయంత్రం 6:45 గంటల సమయంలో నాలుగవ ప్లాట్‌ఫారంపైకి తీసుకొస్తు ండగా ఏసీ కోచ్ బీ-2 బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటా హుటిన మూడు ఫైర్ ఇంజనులు స్టేషన్ కు చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం సంభవించినప్పుడు బోగీలో ఎవ్వరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒక వేళ ప్రమాదం జరగడానికి ముందే ప్రయాణీకులు రైలులో ఎక్కి ఉంటే ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉండేదని పలువురు ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంపై రైల్వే అధికారులు స్పందిస్తూ ఘటన సమయంలో కోచ్‌లో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం లేదని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే సిబ్బంది అప్రమత్తమై మంటలను వెంటనే అదుపులోకి తీసుకొచ్చారనీ చెప్పారు. అగ్ని ప్రమాదానికి గురైన కోచ్‌లను రైలు నుంచి వేరు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందనీ అధికారులు తెలిపారు.

## చౌదర్‌పల్లిలో విషాదఛాయలు

### ఒకే రోజు ఇద్దరు యువకుల దుర్మరణం

**గుండెపోటుతో ఒకరు,ఈతకు వెళ్లి నీటిలో మునిగి మరొకరు**

**తలకొండపల్లి మే16(జనంసాక్షి):** మండలంలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వేరువేరు స్థలాలలో శనివారం మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మరణించడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. మృతులైన చెరుకు మహేష్, (28) కాలే అనిల్ కుమార్(20) మరణించడంతో కన్నీరు మున్నీరయ్యారు. మృతి చెందిన సంఘటన వివరాలు..చౌదర్ పల్లి గ్రామానికి చెందిన చెరుకు మహేష్ కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాదులో తన కుటుంబంతో నివసిస్తూ,డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు..శుక్రవారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అలాగే గ్రామానికి చెందిన కాలే కృష్ణయ్య కుమారుడు అనిల్ కుమార్ చదువుల నిమిత్తం ఊరుకొండ మండల పరిధిలోని ఊరుకొండ పేట గ్రామంలో తన పెద్దమ్మ దగ్గర ఉంటున్నాడు.వేసవి సెలవుల్లో సరదాగా ఫ్రెండ్స్ తో కలిసి గ్రామ సమీపంలోని బావిలో ఈత కొట్టడానికి వెళ్ళాడు.ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు.ఎదిగి వచ్చిన కొడుకు ఇలా అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకంలో మునిగిపోయారు.ఈత సరదా ప్రాణాలను బలిగొనడంతో గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.వేసవి సెలవులకు వచ్చిన పిల్లలను విచ్చలవిడిగా విడిచిపెట్టకుండా వారిని కంటికి రెప్పలా చూసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి
- అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం



**కరీంనగర్ బ్యూరో, మే 16 (జనంసాక్షి) :**
కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్య సాధన దిశగా సమన్వయంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మ్యాపింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి దశను ప్రణాళి కాబద్ధంగా అమలు చేస్తూ ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలి

**పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం**

కరీంనగర్‌లోని పద్మనగర్, ఆరేపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనుల పురోగతి, మౌలిక సదుపాయాలు, పెండింగ్ అంశాలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇంకా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఇండ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యుత్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనుల పూర్తి చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమయపాలనతో ముందుకెళ్లాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, తహసీల్దారులు లక్ష్మీ నరసింహారావు, నరేందర్ వెంకటలక్ష్మి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అప్పు తీర్చలేక జంట హత్యలు

- దాసరి ఫామ్ హౌస్ దగ్గర ఇద్దరు మహిళల దారుణ హత్య
- తాండూర్ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి
- కాల్ డేటా ఆధారంగా ఛేదించిన జంట హత్య కేసు




**వికారాబాద్ జిల్లా బ్యూరో / మొయినాబాద్, మే 16 (జనంసాక్షి):**
ఆపదలో ఆదుకున్న పాపానికి పచ్చని కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కులను కోల్పోయాయి. బంధువులను నమ్మినందుకు ప్రాణాలు తీశారు. అప్పు ఇవ్వడమే వారికి శాపంగా మారింది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్, యాలాల మండలాలకు చెందిన ఇద్దరు మహిళలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పట్టణం తోల్కట్ట దాసరి ఫామ్ హౌస్ దగ్గర దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలు రెండు నెలల వ్యవధిలో జరిగాయి. తాండూర్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు జంట హత్య కేసులను ఛేదించారు.
మార్చి 24న యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబా బీబేగం మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఏప్రిల్ 4న బషీరాబాద్ మండలం ఖాసీంపూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం మిస్సింగ్ జరిగినట్లు బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు నెలల వ్యవధిలో రెండు మిస్సింగ్ కేసులు నమోదు కావడంతో పోలీసులు సవాలుగా తీసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు.
తోల్కట్ట దగ్గర జంట హత్యల కేసు వెలుగులోకి వచ్చింది. అబేదా బేగం తన దగ్గరి బంధువు కరీమా బేగం నుంచి గతంలో 2 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చింది. అందులో 50 వేలు తిరిగి వచ్చాయి. మిగిలిన 1.50 లక్షలు అడిగినందుకు డబ్బులు ఇవ్వలేక కరీమా బేగం, ఆమెతో అక్రమ సంబంధం ఉన్న రహమత్, నయీం కలిసి ఆమెను హత్య చేసి ముడిమాల రిజర్వ్ ఫారెస్ట్‌లో పాతిపెట్టారు.
అదేవిధంగా మహబూబా బీబేగం కూడా కరీమా బేగం దగ్గర 40 వేలు అప్పుగా ఇచ్చి, తిరిగి అడిగినందుకు హత్య చేశారని విచారణలో తేలింది. మృతుల ఒంటిపై ఉన్న బంగారు నగలు మాయమయ్యాయి. నిందితులు కాజేశారా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
తాండూర్ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆదేశాలతో తాండూర్ సీఐ, మొయినాబాద్ పోలీసులు, తహసీల్దార్ సమక్షంలో ముడిమాల రిజర్వ్ ఫారెస్ట్‌లో పూడ్చిపెట్టిన సమాధులను తీసి పంచనామా నిర్వహించి మృతుల అస్థికలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సర్ పక్రియను వేగవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
సర్ ప్రక్రియను వేములవాడలో వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎ. జయంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ మాట్లాడుతూ మ్యాపింగ్ మరియు ప్రోజెనీ శాతాల పురోగతిని సమీక్షించి, వాటిని మరింత మెరుగుపర్చుటకు సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేసి సర్ కార్యక్రమాలలో మెరుగైన పనితీరు కనబరచాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇంకా మ్యాపింగ్ పూర్తి చేయని ప్రజలు బిఎల్ఓ లకు సహకరించి,2002 ఎన్నికల వివరాలను అందించి మ్యాపింగ్ ప్రక్రియను సహకరించాలన్నారు. మరణించిన, డూప్లికేట్, షిఫ్టెడ్, గైర్హాజరు ఓటర్ల వివరాలను గుర్తించి, ఓటరు జాబితా నుండి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐలు శ్రీనివాసు, శ్రీధర్, జీపీఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పెన్షన్ లబ్ధిదారులు వివరాలు అందించాలి

**మున్సిపల్ కమిషనర్, ఎం,డి,ఖదీర్ పాష**

**సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో చేయూత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు వార్డు అధికారికి వివరాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.డి. ఖదీర్ పాష తెలిపారు. తెలంగాణ వారిచే జారీ చేసిన సర్క్యులర్ నెంబర్ 1677 సెర్ప్ 2026లో పొందుపరిచిన ఆదేశాల ప్రకారం లబ్ధిదారులు ఎఫ్,ఆర్, ఎస్ ద్వారా తమ వివరాలు త్వరితగతిన నమోదు చేసుకోవాలన్నారు.**

## ప్రజలకు భారంగా మారుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

### తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదు

**మల్యాల మే 16 (జనం సాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతూ నడ్డి విరుస్తున్నాయి కొండగట్టులో విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు సుంకర శంకర్ అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచితే గగ్గోలు పెట్టినటువంటి ప్రధానమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లీటర్ కు 3 రూ చొప్పున పెంచడం ఎంతవరకు న్యాయం ప్రజలు రైతుల పైన ప్రేమ ఉంటే రేట్లు పెంచవద్దని డిమాండ్ చేశారు.దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడాల్సిన ప్రభుత్వాలు ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్నాయని తెలిపారు. కొండగట్టులో మంచినీటి శాశ్వత పరిష్కారం కోసంముత్యంపేట వరద కాలువ నుండి సంతల్లోద్ది వరకు అక్కడి నుండి కొండగట్టు గుట్ట పైకి నీళ్లు పోవడానికి బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులే తప్ప తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదు,కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా భక్తులను దృష్టిలో ఉంచుకొని పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మల్యాల పట్టణానికి సంబంధించిన జగ్గని ఒర్రెను సంబంధించిన నిధులు 2021 లోనే 4 కోట్ల 17 లక్షలు మంజూరు చేశాను తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు జనగాం శ్రీనివాస్,తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్లు సాగర్ రావు,మధుసూదన్ రావు,మల్లేశం గౌడ్, ప్రవీణ్, హజార్, శ్రీనాథ్, సంజీవ్ గడ్డం రాజేశం, దశరథం, రాజేందర్, అనిల్ రెడ్డి, చిన్న దుర్గయ్య, నగేష్, శ్రీనివాస్ గౌడ్,రవితేజ సలీం పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ విషయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

**వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసిన ఫార్మ బాధిత రైతులు**



**యాచారం, మే 16 (జనం సాక్షి) :** ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని రైతు కమిషన్ కార్యాలయంలో ఫార్మా బాధిత రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఫార్మసిటీ రద్దని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడంతో రైతులంతా పాలాభిషేకం చేశారని చెప్పారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా భూములు ఇవ్వొద్దని రైతులు ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అంతా కలిసి కోర్టుకెళ్లారని వారి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు.
రైతుబంధు రాకపోవడం, రుణమాఫీ కాకపోవడం, క్రాప్ లోన్లు రాకపోవడం, ఆన్లైన్లో పేరు రాకపోవడం వల్ల పండించిన గింజలు కొనుక్కోకపోవడం లాంటి దుర్భరమైన పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతులకు రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తరచూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తో పాటు వారిని కూడా కలుస్తూనే ఉన్నామని విన్నవించారు. తుమ్మలూరు, బ్యాగరి కంచె వద్ద రైతులకు ఎంత పరిహారం ఇస్తున్నారో అదే తరహాలో నాలుగు గ్రామాల రైతులకు వర్తించే విధంగా అమలు చేయాలని కోరారు. భూములు ఇవ్వని రైతులకు భూములను సేద్యం చేసుకునేలా భూములను కేటాయించి రైతులను అనుమతించాలని కోరారు.
కాంగ్రెస్ సర్కార్ రైతులకు న్యాయం చేయకపోతే ముందు వచ్చే ఏ ప్రభుత్వాలైన రైతులకు న్యాయం చేయమని స్పష్టంగా రైతులు చెప్పారు. ఉద్యమాలు రైతులకు కొత్తవేమీ కాదని సమస్యను పరిష్కరించుకుంటే గత ప్రభుత్వంపై ఎలా ఉద్యమం చేశామో కాంగ్రెస్ ప్రభుత్వంపై అదే తరహాలో ఉద్యమం చేయడానికి సిద్ధమవుతామన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని కోదండరాం, కోదండ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సర్పంచ్ లో ముత్యాల వెంకటరెడ్డి, బందే రాజశేఖర్ రెడ్డి, దూస రమేష్ నియోజకవర్గ టీజేఎస్ ఇన్చార్జి సామ నిరంజన్, పలువురు రైతులు వారిని కలిసిన వారిలో ఉన్నారు.

## పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యం?

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపేలా కృషి చేయాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు




ముషీరాబాద్, మే 16 (జనంసాక్షి): పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం ప్రజలపై నేరుగా పడుతుందని, గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 'మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి.. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి... తగ్గించాలి..' అని నినాదాలు చేశారు. బీవీ. రాఘవులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మరోమారు ధరలు పెంచిందని, గతంలో గ్యాస్ ధరలను రెండు దఫాలుగా పెంచిందని విమర్శించారు. ఈ ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపైనా, సామాన్య ప్రజానీకంపైనా తీవ్ర భారాన్ని మోపుతుందని తెలిపారు. ఇప్పటికే ధరలు పెరిగిపోయి అనేక పరిశ్రమలు దెబ్బతిని కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థితిలో ఉందని చెప్పారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం జరుగుతున్నందున పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అప్పుడే చెప్పామని, పొదుపు మంత్రం చెప్పి పొదుపు పాటించటం లేదు కాబట్టి ధరలు పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.
అంతకుముందు పొదుపు చర్యలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. యూరియాను మానేయండి, విదేశీ ప్రయాణాలు ఆపండి, బంగారం కొనకండి, ఆఫీసులకు వెళ్లకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ చేయండి అనటం సరిగాదని, అవన్నీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఉత్పత్తి దెబ్బతిన్న తర్వాత దేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. యుద్ధంలో చేస్తున్న వారికి మద్దతిచ్చేలా మోడీ విదేశీ పర్యటనలు ఉంటున్నాయని విమర్శించారు. హోర్ముజ్‌పై అమెరికా దిగ్బంధనం విరమించుకునేలా కేంద్రం ఒత్తిడి తేవాలని కోరారు. యుద్ధ నివారణకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలని సూచించారు.
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, గ్యాస్ ధరలు పెరగడం వల్ల హోటళ్లలో టిఫిన్లు, భోజనం ధరలు పెరిగాయని, అనేక హాస్టళ్లు మూతపడ్డాయని తెలిపారు. ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బందారు రవికుమార్, సీనియర్ నేత డీజీ. నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.






# ఆక్రమణల తొలగింపు ముందుకా? వెనక్కా?

- ముందుకే అని అంటున్న మున్సిపల్ అధికారులు
- పర్మిషన్లు లేకుండా నిర్మించిన ఇళ్ల సంగతి ఏంటి?

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, మే 16 (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రం లోని మున్సిపల్ పరిధిలో రోడ్లను ఆక్రమించి ఫుట్ పాత్ లపై షాపుల యజమానులు తమ ఇష్టారాజ్యంగా దుకాణాలు ప్రారంభించడం, కిరాయిలకు ఇవ్వడంతో వాహన చోదకులకు, పాదాచారులకు కలుగుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి వెళ్లడంతో గత మూడు రోజులుగా ఆక్రమణల తొలగింపులకు శ్రీకారం చుట్టిన మున్సిపల్ శాఖ,పోలీసుల ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల కిందట కృష్ణవేణి చౌరస్తా నుండి నది అగ్రహారం వెళ్లే మార్గంలో 50 అడుగుల రస్తాను మార్కు చేశారు, ఆక్రమణలకు ఎవరైతే గురిచేశారో వాటిని 90 శాతం పైగానే స్పష్టంగా కూల్చివేతలు జరిగాయి.ఈ కూల్చివేతలు రెండు రోజులుగా ఆగిపోవడంతో పట్టణంలోని ప్రజలు మున్సిపల్ అధికారులపై రకరకాల అనుమానాలకు తెర లేపారు.
ప్రస్తుతము జరుగుతున్న కూల్చివేతలు అసలు అవి కూల్చివేతలు కాదని, అసలు కూల్చివేతలు పట్టణంలోని రాజీవ్ మార్గ్, పాత బస్టాండ్ ప్రాంతం, జూరాల డ్యామ్ రోడ్డు, చేపల మార్కెట్ రోడ్డు ఇలా ఇంకొన్ని ప్రాంతాలలో కూల్చివేతలు చేపట్టి పట్టణము రద్దీని సరిదిద్దాలని ఈ ప్రాంతాలను ప్రస్తుతం నిర్మిస్తున్న నిర్మాణాలకు ఎలాంటి సెట్ బ్యాక్ లు లేవని, సెట్ బ్యాక్ లు లేని నిర్మాణాల జోలిపోకుండా విశాలమైన రోడ్లపై ఆక్రమణల పేరుతో హడావిడి చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, అసైన్ స్థలాలు, టెన్ పర్సెంట్ స్థలాలను కబ్జా చేసినటువంటి వాటికి పర్మిషన్లు ఇచ్చిన అధికారులే నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత ఆక్రమణలు అంటూ అరుస్తున్నారని,నిర్మాణ క్రమంలో పర్మిషన్ల కోసం కార్యాలయం చుట్టూ తిరిగి ముడుపులు చెల్లించుకున్న తర్వాతనే తాము నిర్మాణాలు చేపట్టామని,ఇప్పుడు అదే అధికారులు అక్రమం అక్రమమని పోలీసులను వెంటబెట్టుకొని కూల్చివేతలు చేస్తామంటే ఎట్లా అని యజమానులు వాపోతున్నారు.

### అక్రమాలను తొలగిస్తాం..

ఎలాంటి వారైనా,ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తి లేదని,వాటిని కచ్చితంగా కూల్చివేస్తామని ముందుగా చెప్పి,రెడ్ మార్క్ వేసిన తర్వాత సమయం ఇచ్చి కూల్చివేతలకు ఉపక్రించడం జరుగుతుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆక్రమణలపై ముందుకే చర్యలు ఉంటాయని మునిసిపల్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## యాసంగి మక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి ప్రతినిధి, మే 16 (జనంసాక్షి): యాసంగి 2025-26 సీజన్‌లో జిల్లాలో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.
శనివారం తన చాంబర్‌లో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, డి.ఎం., వేర్‌హౌస్ మేనేజర్లు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ తదితర అధికారులతో చర్చించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తీసుకువస్తున్న మక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అధికారికి మండలాల వారీగా కొనుగోలు చేయాల్సిన మక్కజొన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.
అదేవిధంగా సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మక్కజొన్నను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్‌కు ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్యను పెంచి, ప్రతిరోజూ వాహనాలను పూర్తిస్థాయిలో అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లను గుర్తించి స్టోరేజ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కూడా సూచించారు.
లారీ రవాణా కాంట్రాక్టర్‌కు అవసరమైన లారీల సంఖ్యను పెంచి, మక్కజొన్న రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం లేకుండా నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే డి.ఎం., వేర్‌హౌస్ మేనేజర్ మరియు అదనపు కలెక్టర్‌కు జిల్లాలో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# జిల్లాలో వేగవంతంగా ధాన్యం కొనుగోలు

- రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం
- ప్రత్యామ్నాయ గోదాముల్లో ధాన్యం దిగుమతి
- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 16 (జనంసాక్షి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అపరిల్ పార్కులోని గోదాములలో వరి ధాన్యం దిగుమతిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయి, ఎన్ని అన్‌లోడింగ్ చేశారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసే ప్రక్రియను పరిశీలించారు. హమాలీల వివరాలను అడిగి తెలుసుకుని, హమాలీలకు కావలసిన భోజన సదుపాయం, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వేగవంతంగా తూకం వేసి కొనుగోలు చేస్తూ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతం చేస్తోందన్నారు. జిల్లాలో ఒక లక్ష 90 వేల ఎకరాల్లో వరి ధాన్యం పండించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దన్నారు.

గతంలో కొనుగోలు చేసిన ధాన్యం గోదాముల్లో నిల్వ ఉన్న క్రమంలో రబీ పంటను పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు ఇచ్చే ప్రక్రియ నడుస్తోందని, జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 రైస్ మిల్లులలోని గోదాములు నిండి ఉన్న క్రమంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్ కమిటీల గోదాములలో 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

ఈసారి యాసంగి పంట దిగుబడి ఎక్కువ వచ్చిందన్న కారణంగా సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు ఆదేశాలతో సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ అపరిల్ పార్క్ వద్ద ఉన్న గోదాములలో ధాన్యం నిల్వ చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ధాన్యం దింపే ప్రక్రియ రెండు రోజుల క్రితమే ప్రారంభమైందన్నారు.

అపరిల్ పార్క్ లోని గోదాముల వద్ద ధాన్యం దించే క్రమంలో లారీల వెంట వచ్చే హమాలీలు, డ్రైవర్లు, రైతులకు వసతులు కల్పించే విషయంపై అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, వారికి భోజన వసతి, మంచినీటి వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు. హమాలీలు, సిబ్బందికి మూడు పూటల భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు.

గత ప్రభుత్వంలో లారీలను మాత్రమే ధాన్యం తరలింపునకు వినియోగించడంతో రైతులకు ఇబ్బం దులు తలెత్తిన దృష్ట్యా మా కాంగ్రెస్ ప్రభుత్వంలో లారీలతో పాటు వ్యానులను, ట్రాక్టర్లను సైతం వినియోగిస్తూ రైతులకు ధాన్యం తరలింపులో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు.

రైతుల సమస్యలంటూ లేని సమస్యలను రాజకీయం చేసే ప్రయత్నం బీఆర్ఎస్ పార్టీ చేస్తోందని, ఈ అంశాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించే పేటెంట్ ఏదైనా ఉంటే అది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అలాంటి తప్పిదాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న సమస్యలను అధిగమించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామని, మార్కెట్ కమిటీ గోదాములతో పాటు ప్రస్తుతం అపరిల్ పార్క్‌లోని గోదాములను సైతం ప్రభుత్వం అలాట్ చేసిందన్నారు. రైతులు అధైర్యపడకుండా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.



## కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త ముందుండాలి

- కొత్త పాత తేడా లేకుండా ఐక్యంగా పని చేయాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాలి : మంత్రి లక్ష్మణ్ కుమార్
- ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించాలి

**ఎండపల్లి, మే 15 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్‌ను ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి పని చేయాలని మంత్రి సూచించారు. గతంలో పని చేసిన నాయకులతో పాటు కార్యకర్తలను విస్మరించకుండా పార్టీ నియమాలకు లోబడి పని చేస్తూ వచ్చే ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తోంది

- ప్రతిపక్షాలు అబద్ధాలతో రైతులను రెచ్చగొడుతున్నారు.
- ధాన్యం కొనుగోలు వేగంగా సాగుతోంది
- నిజామాబాద్ జిల్లాలో 5.82 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు



నిజామాబాద్ అర్బన్, మే 16 (జనంసాక్షి): జిల్లాలో ప్రతిపక్షాలు అబద్ధపు మాటలతో రైతులను రెచ్చగొడుతూ రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్న సందర్భంగా ప్రజలకు వాస్తవాలను వివరించడానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 5 లక్షల 82 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో 1181 కోట్ల రూపాయలు జమ చేసినట్లు వివరించారు. రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా ధాన్యం కొనుగోలులో అత్యధికంగా కొనుగోలు చేసిన జిల్లాగా ఉందన్నారు.

50 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేశామని, రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో జిల్లాలో ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేసి తీరుతామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు రైతుల ముసుగులో రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నాయని, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. రాజకీయాల్లో మర్యాద ఉండాలని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కోశాధికారి భక్తవత్సలం, జిల్లా ఉపాధ్యక్షులు కౌడపు శరత్ కుమార్, రత్నాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజా నరేందర్ గౌడ్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులలో సృజనాత్మకతను ఆవిష్కరిస్తున్న బాల భవన్

- కళా వైభవం - కలర్స్ ఆఫ్ చైల్డ్‌హుడ్ కార్యక్రమం : జిల్లా కలెక్టర్
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వేసవి శిక్షణా తరగతులు
- 720 చిన్నారులు పాల్గొన్న శిక్షణా కార్యక్రమాలు



**నిజామాబాద్ అర్బన్, మే 16 (జనంసాక్షి):** చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీ స్తూ, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు బాల భవన్ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రశంసించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని బాల భవన్‌లో శనివారం "కళా వైభవం - కలర్స్ ఆఫ్ చైల్డ్‌హుడ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బాల భవన్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు తమ సృజనను చాటుతూ అందంగా ఆకట్టుకునే రీతిలో తయారు చేసిన కళాకృతులు, ఎంతో హృద్యంగా గీసిన చిత్రాలను కలెక్టర్, మేయర్ ఆసక్తిగా తిలకించారు. చక్కటి పెయింటింగ్స్ గీసిన 7వ తరగతి విద్యార్థి సాయి రుధిర్ కళా నైపుణ్యాన్ని కలెక్టర్ మెచ్చుకుంటూ బహుమతి అందించి ప్రోత్సహించారు. పేరిణి, కోలాటం నృత్యాలతో అలరింపజేసిన చిన్నారులను, వెంట్రిలాక్విజంతో ఆకట్టుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్‌ను కూడా ప్రశంసించారు. ప్రస్తుత వేసవి శిక్షణ తరగతుల్లో బాల భవన్‌లో 720 మంది చిన్నారులకు ప్రవేశాలు కల్పించగా, వారికి శాస్త్రీయ సంగీతం, నృత్యం, మిమిక్రీ, కర్రసాము, డ్రాయింగ్, యోగా, మ్యాజిక్ తదితర 30 అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. కలెక్టర్ చిన్నారుల మధ్యకు వెళ్లి వారికి వివిధ అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చిన్నారులందరికీ చాక్లెట్లు పంచుతూ, ప్రతిభ చాటిన బాలబాలికలకు బహుమతులు అందించారు. బాల భవన్ ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అభినందించిన కలెక్టర్, చిన్నారులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను బాల భవన్‌లో చేర్పించాలని సూచించారు.


ఈ శిక్షణ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని, వారికి ఇష్టమైన అంశాల్లో తర్ఫీదు ఇవ్వడం వల్ల నైపుణ్యాలు మరింతగా మెరుగవుతాయన్నారు. నగర మేయర్ ఉమారాణి మాట్లాడుతూ, నేటి చదువులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో బాల భవన్ ద్వారా అందిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు చిన్నారులకు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తూ, వారిలో సృజనాత్మకతను, నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. ఈ తరహా అవకాశాలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి పి. అశోక్, బాల భవన్ సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ పర్యవేక్షకుడు ప్రభాకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



**బోధన్, మే 16 (జనంసాక్షి) :** ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కూలీల పొట్టగొడుతుందని మల్లేష్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఎరాజ్ పల్లి గ్రామంలోని చెరువు వద్ద ఉపాధి హామీ పనులు జరుగుతున్నటువంటి ప్రదేశాన్ని సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ మరియు ఏఐపీకేఎంఎస్ ల ఆధ్వర్యంలో వెళ్లి సందర్శించడం జరిగింది. అచ్చట పనులు చేస్తున్నటువంటి కార్మికులకు మండుతున్న ఎండల నుండి రక్షణ కోసం టెంట్ లాంటి ఏర్పాట్లు లేవు, ఏవైనా దెబ్బలు తగిలితే గాయాలయితే ఫస్ట్ ఎయిడ్ కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవని తేలింది. వీటిని చూసి పరిశీలించిన తర్వాత పనిచేస్తున్న కార్మికులకు వారం వారం బట్వాడాలు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారి కూలీలను ప్రతి వారం ఒకసారి చెల్లించాలని, అదేవిధంగా టెంట్లు మంచినీరు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఉపాధి హామీ పనులకు అయ్యే ఖర్చులను గతంలో కేంద్ర ప్రభుత్వము 90% ఇచ్చేదని కానీ దాన్ని 60 శాతానికి తగ్గించిందని రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో 10 శాతం మాత్రమే చెల్లించేవని కానీ దాన్ని 40 శాతానికి పెంచిందని దీని మూలంగా రాష్ట్రాల వద్ద నిధుల కొరతతో పనులు జరగక ఈ ఉపాధి హామీ పనులను నిర్వీర్యం చేయాలని చూస్తుందని ప్రజలకు ఉపాధి హామీ లేని బికారులుగా మార్చేటట్లు మోడీ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బి మల్లేష్ తో పాటు టి యు సి ఐ నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు పాల్గొన్నారు.

## జాడిజమాల్పూర్‌లో మొక్కజొన్న పంట దగ్ధం



**బోధన్, మే 16 (జనంసాక్షి) :** సాలూర మండలం జాడిజమాల్పూర్ గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. సదరు రామకృష్ణ రైతు మొక్కజొన్న పంటను నూర్పిడి చేసి బ్యాగులలో నింపి ఉంచడం జరిగింది. అయితే నేడు ఒక్కసారిగా మంటలు చెలరేగి బ్యాగులలో ఉన్న మొక్కజొన్న మొత్తం కాలి బూడిద అయింది. ఈ మేరకు రైతుకు మూడు లక్షల రూపాయల నష్టం వాటినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ప్రజల భద్రతే మా ప్రాధాన్యత : ఇన్స్పెక్టర్ శ్రీనాథ్

**శామీర్ పేట, మే 16(జనం సాక్షి) :** ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉంటూ తమ విలువైన వస్తువులు కాపాడుకోవాలని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ శనివారం తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని "మీ సురక్ష - మీ భద్రత మా ప్రాధాన్యత" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనర్ సూచనల మేరకు గృహ సహాయకుల( ఇంటి పని మనుషులు) వివరాల నమోదు కార్యక్రమం కోసం శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ పోలీస్ సిబ్బందిని 20 బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి గృహ సహాయకుల వివరాలు సేకరిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లలో పని చేసే గృహ సహాయకులు, అద్దెదారులు, సెక్యూరిటీ సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. పోలీస్ వారు పంపించిన గూగుల్ ఫారంను నింపడం లేదా సమీప పోలీస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్‌కు వివరాలు అందించి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రాంతంలో ఇటీవల గృహ యజమానిపై నేపాలి దేశానికి చెందిన గృహ సహాయకులు (పని మనుషులు) దోపిడీకి పాల్పడిన సంఘటన ప్రజల్లో ఆందోళన కలిగించిన విషయం తెలిసిందే అన్నారు.

## తారు రోడ్డు నిర్మాణం నాణ్యతతో చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం
- సెంట్రల్ లైటింగ్ పనుల్లో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు వేయాలి



చొప్పదండి, మే 16 (జనంసాక్షి): చొప్పదండి మున్సిపల్ పరిధిలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా ఇరువైపులా తారు డబుల్ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యతతో చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, చైర్‌పర్సన్ వడ్లూరు సరితలకు కౌన్సిలర్ కొత్త సుమలత - గంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు నలుమాచు జ్యోతి - రామకృష్ణ, కొత్తూరి మహేష్, మాదూరి శ్రీనివాస్ లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు పాత తారు రోడ్డు తొలగించకుండా కొత్తగా దాని పైన తారు రోడ్డు వేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉందని తెలిపారు. సంబంధిత ఇంజనీర్ల అంచనాల ప్రకారం షిల్ట్ తొలగించి రోడ్డు వేయాలని, పనులకు సంబంధించిన అంచనా లెక్కల ప్రకారం పనులు జరగాలని కోరారు. ఎస్టిమేట్ ప్రకారం అధికారులు పరిశీలించి పనులు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యతతో చేయకుంటే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



## రేకుర్తిలో ఘనంగా అభివృద్ధి పనులకు భూమి పూజ

**పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు**

**కరీంనగర్, మే 16 (జనంసాక్షి):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సుధగోని మాధవి-కృష్ణ గౌడ్ లతో కలిసి 10 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక కాలనీవాసులు, పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మత్తు వదలకుంటే పీడీ యాక్ట్ తప్పదు

- గంజాయి, మత్తు పదార్థాల వినియోగదారులకు హెచ్చరిక
- డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారికి, రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్
- పునరావృతం అయితే కఠిన చర్యలు



**నిజామాబాద్ క్రైం, మే 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ టీం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరయ్యారు. గతంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానితులను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని వివరించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ఆరోగ్యపరంగా ప్రమాదకరమే కాకుండా చట్టపరంగా కూడా తీవ్రమైన నేరమని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గతంలో కేసులు నమోదైన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకొని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని, మళ్లీ ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని, విద్యాసంస్థలు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, కుటుంబ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు.

అనంతరం ఈగల్ టీం, పోలీస్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు చేపట్టారు. పరీక్షల్లో కొంతమంది వ్యక్తులకు డ్రగ్స్ వినియోగం పాజిటివ్‌గా తేలడంతో వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏ.ఆర్) రామ్ చందర్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈగల్ టీం డీఎస్పీ ఎం. సోమనాథం, హోమ్ గార్డ్ ఏసీపీ కె. దీపక్ చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, సౌత్ రూరల్ సీఐ ఎన్. సురేష్ కుమార్, నార్త్ రూరల్ సీఐ బి. శ్రీనివాస్, డిచ్పల్లి సీఐ కె. వినోద్, ధర్పల్లి సీఐ బిక్షపతి, నిజామాబాద్ డివిజన్ ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ వినూత్న నిరసన

- పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ డిమాండ్
- కేంద్ర ప్రభుత్వంపై విమర్శల అస్త్రం.. తాడుతో ఆటోని లాగుతూ నిరసన

**శంకరపట్నం మే 16 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధరల పెరుగుదలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు నిరసనగా అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. రైతులు, కూలీలు, కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఇంధన ధరల పెరుగుదల కారణంగా రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో మధ్యతరగతి, పేద ప్రజల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తారు రోడ్డు నిర్మాణం నాణ్యతతో చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం
సెంట్రల్ లైటింగ్ పనుల్లో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు వేయాలి

చొప్పదండి, మే 16 (జనంసాక్షి): చొప్పదండి మున్సిపల్ పరిధిలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా ఇరువైపులా తారు డబుల్ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యతతో చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, చైర్‌పర్సన్ వడ్లూరు సరితలకు కౌన్సిలర్ కొత్త సుమలత - గంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు నలుమాచు జ్యోతి - రామకృష్ణ, కొత్తూరి మహేష్, మాదూరి శ్రీనివాస్ లు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు పాత తారు రోడ్డు తొలగించకుండా కొత్తగా దాని పైన తారు రోడ్డు వేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉందని తెలిపారు. సంబంధిత ఇంజనీర్ల అంచనాల ప్రకారం షిల్ట్ తొలగించి రోడ్డు వేయాలని, పనులకు సంబంధించిన అంచనా లెక్కల ప్రకారం పనులు జరగాలని కోరారు. ఎస్టిమేట్ ప్రకారం అధికారులు పరిశీలించి పనులు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యతతో చేయకుంటే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 మే 2026

## 18నుండి 23వరకు క్రీడా పర్యాటక వారోత్సవాలు

### జిల్లా కలెక్టర్లతో సీఎస్ కె.రామకృష్ణారావు టెలీకాన్ఫరెన్స్



**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయ వంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు జిల్లా కలెక్టర్లను ఆదేశిం చారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాల ని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమా లను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకా రులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్- తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడ తాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

# 21 నుంచి సరస్వతి నది అంత్య పుష్కరాలు

### మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సరస్వతి నది అంత్య పుష్కరాలు ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1 వరకు కాళేశ్వరం దేవస్థానంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ పుష్కరాలలో సుమారు 30 నుండి 40 లక్షల మంది భక్తులు పాల్గొని అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లపై శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మే 21 ఉదయం 5:43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పుష్కర స్నానంతో ఈ పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదే రోజు రాష్ట్ర గవర్నర్ కూడా పవిత్ర స్నానంలో పాల్గొననున్నారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలని ఆదేశిం చారు. కాళేశ్వరం ఆలయం పరిసరాల్లో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

మంత్రి సురేఖ మాట్లాడుతూ ఇటీవల విజయవంతంగా నిర్వహిం చిన మేడారం జాతర తరహాలో ఈ పుష్కరాలను నిర్వహించాలని అన్నారు. ప్రతి రోజు ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు పాల్గొని పుణ్యస్నానాలు చేయనున్నారని తెలిపారు. ఉదయం హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృ ష్ణారావు మాట్లాడుతూ భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, రవాణా, తాగునీరు, భద్రత, ప్రోటోకాల్ వంటి అన్ని అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ రామయ్యర్ మాట్లాడుతూ గతంలో 2012లో జరిగిన పుష్కరాలకు సుమారు 2 లక్షల మంది మాత్రమే హాజరయ్యారని, కానీ గత ఏడాది జరిగిన ఆది పుష్కరాలకు 40 లక్షల మంది భక్తులు వచ్చినట్లు తెలిపారు. ఈసారి పుష్కరాలలో ప్రతిరోజూ హోమాలు, హారతులు, తెప్పోత్సవం, పిండప్రదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు చెప్పారు. ప్రత్యేక మ్యూజియంను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రవాణా శాఖ తాత్కాలిక బస్ స్టేషన్లు, షటిల్ సేవలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఆర్ డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, శుభ్రత చర్యలు చేపడుతోం దన్నారు. వైద్యశాఖ వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సదుపాయాలు అందించ నుందని తెలిపారు. పోలీసు శాఖ పార్కింగ్ సదుపా యాలు, ట్రాఫిక్, సీసీ కెమెరాలు, వాచ్ టవర్లు, భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్. ముకుందరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పంచాయతి రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ

### కర్రలు, కత్తులతో దాడులతో పలువురికి గాయాలు

**వరంగల్, మే16 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మర్రి తండాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న భూవివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘర్షణ గురించి సమాచారం అందుకున్న రాయపర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘర్షణకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## లైంగికంగా విద్యార్థిని లోబర్చుకునే యత్నం

### వెలుగులోకి అసిస్టెంట్ ప్రొఫెసర్ నిర్వాకం



**లక్నో, మే16 (జనంసాక్షి) :** కొందరు ఉపాధ్యాయ వృతికి అపకీర్తి తెస్తున్నారు. బిడ్డలాంటి తమ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి కీచక గురువులకు పోలీసులు బుద్ధి చెప్తున్నా.. ఇంకా పుట్టుకొస్తున్నారు. తాజాగా లఖ్‌నవూ యూనివర్సిటీ ప్రొఫెసర్ కీచక బుద్ధి వెలుగులోకి వచ్చింది. లఖ్‌నవూ యూనివర్సిటీలో పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేస్తానని ఆశ చూపిస్తూ, ఒక విద్యార్థిని పట్ల జువాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ పరంజీత్ సింగ్ అసభ్యంగా ప్రవర్తించాడు. యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హసన్‌గంజ్ పోలీసులు సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఆడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యూనివర్సిటీ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడైన ప్రొఫెసర్ పరంజీత్ సింగ్ ఒక విద్యార్థినితో అత్యంత అసభ్యకరంగా మాట్లాడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. సదరు విద్యార్థినికి అకడమిక్ బెనిఫిట్స్ కల్పిస్తా నని నమ్మిస్తూ ఆమెను లొంగదీసుకోవడానికి ప్రయ త్నించాడు. దీనికి సంబం ధించిన మూడు ఆడియో రికార్డింగ్‌లను ఆ బాధితురాలు యూనివర్సిటీ యాజమా న్యానికి సమర్పించింది. ఆ ఆడియో క్లిప్‌లలో ప్రొఫెసర్ పరంజీత్ సదరు విద్యార్థినిని.. డార్లింగ్ అంటూ సంబోధిస్తూ తన ఆఫీస్ రూమ్‌కు రమ్మని పిలవడం, పరీక్షల ప్రశ్నపత్రాలను ముందే ఇస్తానని ఆశ చూపడం స్పష్టంగా వినిపిస్తోంది. వారానికి ఒకసారి తనను కలవాలని, అలా చేస్తే పరీక్షల్లో పూర్తి సహాయం చేస్తానని అతను ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం ప్రొఫెసర్ ఆడియో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. యూపీ ప్రభుత్వం పరీక్షల సమగ్రత, లైంగిక వేధింపులకు సంబంధించిన కఠిన నిబంధనలను అమలు చేసి, నిందితుడైన ప్రొఫెసర్‌ను అరెస్టు చేయాలని ఏబీవీపీ లఖ్‌నవూ విశ్వవిద్యాలయ యూనిట్ అధ్యక్షుడు జై శ్రీవాస్తవ అన్నారు. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే ఏ కార్యకలాపాన్నైనా అత్యంత తీవ్రంగా పరిగణిస్తామని యూనివర్సిటీ పరిపాలన విభాగం స్పష్టం చేసింది. 24 గంటల్లోగా తన విచారణ నివేదికను సమర్పించాలని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జెపి సైని అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఆదేశించారు.

## 22న నాటి మ్యాచ్ కోసం నకిలీ యాప్‌లు

- జాగ్రత్తగా ఉండాలి : సిపి



**హైదరాబాద్, మే 16 (జనంసాక్షి) :** మే 22న ఉప్పల్ వేదికగా జరగనున్న ఎస్ఆ ర్‌హెచ్, ఆర్సీబీ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు సీపీ సజ్జనార్ హెచ్చరిం చారు. 'సోషల్ మీడియా వేదికగా ఐపీఎల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి అనేక ప్రకటనలు దర్శనమిస్తున్నాయి. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికార లింకులను నమ్మి మోసపోవద్దు. ఇలాంటి ఫేక్ యాప్స్, వెబ్‌సైట్లపై నిఘా ఉంచాం. ఎవరికైనా ఇలాంటి యాప్స్, వెబ్‌సైట్ల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి' అని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

## పంట వ్యవర్థాలను కాల్చడంతో ప్రతికూల ప్రభావం

- రైతులకు అవగాహన కల్పించాలి
- వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి

**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల భూసారం, పర్యావరణం మరియు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి తెలిపారు. తాత్కాలిక సౌలభ్యం కోసం పంట వ్యర్థాలను తగులబెట్టడం రైతులకు దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలను కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంచాలకులు ఆదేశించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో పాటు రైతులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాల్లో పంట అవశేషాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అలాగే, పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చకుండా రోటావేటర్తో కలియదున్నడం, వేస్ట్ డీకంపోజర్ వినియోగం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని రైతులను కోరారు. ల÷తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని డా. బి. గోపి ఆకాంక్షించారు.

## బోరుబావిలో పడ్డ మనవడు

- రక్షించబోయిన తాత మృతి



**నల్లగొండ, మే16 (జనంసాక్షి) :** మిర్యాలగూడ మండలంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మనుమడిని కాపాడబోయి తాత మృతిచెందిన విషాద సంఘటన మిర్యాలగూడ రూరల్ మండలం యాదగిరిపల్లిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావి పక్కన సుమారు 12 అడుగుల గోయి ఏర్పడింది. గ్రామానికి చెందిన వెంకన్న శనివారం ఉదయం తన కూతురు పిల్లలు హేమాన్ష, లోహితను పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. పనులు చేస్తుండగా మనుమడు హేమాన్ష ఆడుకుంటూ బోరు పక్కన ఏర్పడిన గుంతలో పడిపోయాడు. అది గమనించిన వెంకన్న బాలుడిని పైకి తీసే క్రమంలో తాను జారీ తలక్రిందులుగా గుంతలో ఇరుక్కుపోయాడు. పైకి లేచేందుకు ప్రయత్నిస్తే లేవలేకపో తుండడంతో గమనించిన మనుమరాలు భయపడి సమీపంలో ఉన్న రైతులకు విషయం చెప్పింది. వారు బోరు గుంత వద్దకు వచ్చి వెంకన్నను, పిల్లవాడిని రక్షించే ప్రయత్నం చేశారు. రూరల్ ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓ యువకుడి సాయంతో ఇద్దరిని గుంత నుండి వెలికితీశారు. వైద్య పరీక్షల కోసం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకన్న మృతి చెందాడు. బాలుడు సురక్షితంగా ఉన్నాడు. నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే బాలుడి తాత వెంకన్న అక్కడకు చేరుకుని చిన్నారిని రక్షించేందుకు బోరుబావిలోకి దిగాడు. ఈ క్రమంలో బోరుబావిలో వెంకన్న తలకిందులుగా ఇరుక్కుపోయాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పోలీసు బృందం ఎంతో శ్రమించి తాత, మనవడిని బయటకు తీశారు. వెంటనే ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే బోరుబావిలో తలకిందులుగా ఇరుక్కో వడంతో ఊపిరాడక వెంకన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.మనవడిని రక్షించబోయి తాత ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## ఉప్పల్ వరంగల్ రూటులో ట్రాఫిక్ ఆంక్షలు

- వరంగల్ బస్టాప్ నల్లచెరువుకు తరలింపు

**హైదరాబాద్, మే16 (జనంసాక్షి) :** ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్‌హెచ్-163 మీదకు డైవర్ట్ చేయనున్నారు. అలాగే, వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులో వెళ్లి ఫ్లైఓల్గ÷వర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి వచ్చే పెద్ద వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్‌కు మళ్లించనున్నారు.

## బెంగాల్‌లో ఇక చట్టబద్ధమైన పాలన


- పోలీస్ సంక్షేమ బోర్డు రద్దు చేస్తున్నట్లు ప్రకటన
- బెంగాల్ సీఎం సువేందు అధికారి వెల్లడి



**కోల్‌కతా, మే16 (జనంసాక్షి) :** పశ్చిమబెంగాల్ ను గత పాలకుల ఇష్టానుసారం పాలించే వారని , ఇప్పుడు ఆ స్థానే చట్టబద్ధ పాలనను రాష్ట్రంలో తీసుకు వచ్చామని ముఖ్యమంత్రి సువేందు అధికారి అన్నారు. సీఎంగా పగ్గాలు చేపట్టిన తర్వాత దక్షిణ 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్‌లో తొలిసారి పోలీస్ అడ్మినిస్ట్రేషన్ మీటింగ్‌లో శనివారంనాడు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ సంక్షేమ బోర్డును రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. పోలీసు సంక్షేమ బోర్డు ఒక రాజకీయ పార్టీకి 'బ్రాంచ్ ఆర్గనైజేషన్'గా మారినందునే దీనిని రద్దు చేస్తున్నామని తెలిపారు. 'ఒక మంచి ఉద్దేశంతో పోలీసు సంక్షేమ బోర్డు ఏర్పాటయింది. అయితే చివరికి అది పార్టీ అనుబంధ సంస్థగా మారిపోయింది. అది పోలీసు సంక్షేమానికి ఉపయోగపడిందా లేదా అనేది నాకు తెలియదు. కానీ, అక్రమపద్ధతిలో ఉద్యోగాల ఎక్స్‌టెన్స్‌కు మార్గంగా మారింది. కొందరు వ్యక్తిగతంగా లబ్ధిపొందారు. అందుకే ఆ బోర్డును ఇవాళ రద్దుచేస్తున్నాం' అని సువేందు చెప్పారు. పోలీసు సంస్కరణలకు అవసరమైన కొత్త విధివిధానాలను మూడు నెలల్లో రూపొందించేందుకు చీఫ్ సెక్రటరీ సారథ్యంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. పోలీసులు వేధింపులకు పాల్పడితే సాధారణ పౌరుడు సైతం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చని, చట్టం అందరికీ సమానమని సువేందు అన్నారు. ఈ-రిక్షాలు, ఆటోరిక్షా డ్రైవర్లు, హాకర్ల నుంచి ఒక వర్గం పోలీసులు కానీ, స్థానిక గ్రూపులు కానీ డబ్బులు వసూలు చేస్తుంటే ఎలాంటి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సుంకాల పేరుతో సొమ్ములు వసూలు చేయడం కానీ, రోడ్లపై వాహనాలు నిలిపివేయడం కానీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఉన్న పోలీసు అధికారులపై దాడులు జరిగితే సహించేది లేదని, ఇందుకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి ఎవరు పాల్పడినా వారి వ్యక్తిగత సేవింగ్స్‌ను నష్టపరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## భోజ్‌శాల వద్ద భద్రత కట్టుదిట్టం

### హైకోర్టు తీర్పుతో జిల్లా యంత్రాంగం చర్యలు



**భోపాల్, మే 16 (జనంసాక్షి) :** భోజరాజు కాలంలో ఏర్పాటు చేసిన భోజశాల కాలక్రమంలో ఇస్లాం దాడుల్లో కనుమరుగయ్యింది. దానిని ముస్లింలు స్వాధానం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇది సరస్వతీమాత ఆలయంగా హిందువుల విశ్వాసం. తాజాగా మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్ హిందూ ఆలయానికి చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం నాడు సంచలన తీర్పు వెలువరించింది. మసీదు నిర్మాణం కోసం ముస్లింలు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జస్టిస్ విజయ్ కుమార్ శుక్లా, జస్టిస్ అలోక్ అవస్థితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆలయాన్ని సందర్శించే ప్రజలకు తగిన వసతులు కల్పించాలని సూచించింది. భోజ్‌శాల కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ, భద్రత, మతపరమైన ఆచారాల నియంత్రణకు సంబంధించి పురావస్తు శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. 1958 నాటి ఏఎస్ఐ చట్టం ప్రకారం, ఈ ఆస్తుల బాధ్యతలను ఏఎస్ఐ నిర్వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. భోజ్‌శాల ఆలయ వ్యవహారాలు, పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. భవిష్యత్తులో ఈ కట్టడం చారిత్రక నేపథ్యం దెబ్బతినకుండా ఏఎస్ఐ పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. పురావస్తు శాఖ ఇటీవల సమర్పించిన రెండు వేల పేజీల సర్వే నివేదికను హైకోర్టు పరిగణనలోకి తీసుకుం ది. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ పర్మార్ రాజుల కాలం నాటి ఆలయం ఉండేదని, పాత ఆలయ భాగాలతోనే మసీదు నిర్మించారని పురావస్తు శాఖ నివేదికలో పేర్కొంది. ఈ ఆధారాలనే ధర్మాసనం ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సవాలు చేస్తామని ముస్లిం గ్రూపు ప్రకటించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తుందన్న విశ్వాసం తమకు ఉందని ఎఐఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి సోషల్ మీడియాలో పేర్కొన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ధార్ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ధార్‌లోని భోజ్‌శాల ఆలయం- కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ పరిసరాల్లో దాదాపు 1,200 మంది పోలీసులను మోహరించారు. వివాదాస్పద ప్రదేశాల్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధార్ కలెక్టర్ రాజీవ్ రంజన్ మీనా హెచ్చరించారు.

## ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై వ్యాట్ తగ్గింపు

**న్యూఢిల్లీ, మే 16 (జనంసాక్షి) :** విమానయాన సంస్థలకు భారీ ఊరట కలిగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ ను భారీగా తగ్గించింది. ఏటీఎఫ్‌పై ప్రస్తుతం ఉన్న వ్యాట్‌ను 25 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. విమానాలు నడిపేందుకు జెట్ ఇంజన్లలో ఏటీఎఫ్ వినియోగిస్తున్నారు. వ్యాట్ తగ్గింపునకు ఢిల్లీ సర్కార్ తాజా నిర్ణయంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాయాశ్రంలో ఇంధనం కొనుగోలు చేసే విమానయాన సంస్థలు తక్కువ ధరలను చెల్లించే వీలుంటుంది. 'ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 25 శాతం నంచి 7 శాతానికి తగ్గించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ నిర్ణయంతో ఎయిర్‌లైన్స్‌కు, సాధారణ ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుంది' అని ఒక అధికార ప్రకటన విడుదల చేశారు. దీనికి ఒకరోజు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 18 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మే 15వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370